UNIVERSAL
LIBRARY
OU_204659
UNIVERSAL
LIBRARY

శ్రీరస్తు

శ్రీశోభనాద్రీశ్వరో విజయతామ్

శుభమస్తు

# గోవర్ధనోద్ధారణము.

ఇది

# శ్రీరాజా వేంకటాద్రిఅప్పారాయ చరిత్రము.

నూజవీడు.



కవిప్రకాండ

శ్రీయుత పానుగంటి లక్ష్మీనరసింహరావుగారు.

పర్యాలోకన

శ్రీమదుభయ [illegible] [illegible]య్యగంటి వీరరాఘవాచార్యులవారిచే


నూజవీడు,

శ్రీగౌరీశంకరముద్రాక్షరశాలయందు,

ముద్రింపఁబడియెం.

1928.

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,

శ్రీరస్తు.

శ్రీశోభనాద్రీశ్వరో విజయతామ్.

శ్రీకాంతామణిఁ నాత్మనెమ్మనమునన్ ♦ శేషాద్రిసంజాతమే
లోకాయంబు సగంబునంతటను, నా ♦ గబ్జాక్షి నాస్యంబునన్
జేకొంచున్ భువనాళిఁ బెంచి, తుదకున్ ♦ శిక్షించి, పుట్టించు, మూ
డాకారంబులఁ బాల్చి వెల్గు పరత ♦ త్త్వాధీశునిన్ గొల్చెదన్.

ఉ పల్లవకామినీనయన ♦ వారిచరంబులు, కేశబృందభృం
గోల్లసనంబు, దివ్యరుచి ♦ రోక్తివిలాండజ రాజనాదముల్
సల్లలితాననాబ్జచయ ♦ సంగతినొప్పు సుహూపవాటిలో
నల్లననాడు కృష్ణగజ ♦ మంచిత సత్కృపమమ్ముఁ బ్రోచుతన్.

మ. వరగోపీనయనాబ్జరాజి యలరన్ ♦ వైశంబ దేవేంద్ర బం
ధుర గర్వాంధతిమిరంబునోవఁ గను సం ♦ తోషంబుతో ధేనువుల
కెరలన్ భానుకరంబుపోల్కి మనుపే ♦ కెంగేలుగోవర్ధనం
బురుసౌలభ్యముతోడనెత్తె మదిలో ♦ నూహింతునా హస్తమున్.

శుభమస్తు.

# పాత్రపట్టిక.

1. కృష్ణుడు.
2. గోపకులు.
3. గోపికలు.
4. విప్రకన్యలు.
5. బలరాముఁడు.
6. నందుడు.
7. దేవేంద్రుఁడు.
8. బృహస్పతి.
9. భటుఁడు.
10. అప్సరసలు.
11. ద్వారపాలకుఁడు.

# పూర్వరంగము.

## కవిప్రశంస.

ప్రవేశము—పుష్పాంజలితో సూత్రధారుఁడు.

ఘనతరతరు లతి ♦ కాలతాంతములఁ
దరుణసంపతుల హ్రా ♦ ద్విసిజాతములఁ
బరిమళింపఁగఁజేసి ♦ వసుధసంపదకు
నెలమిఁజేకూర్చెను ♦ నివ్వసంతమునఁ
బ్రకృతి సుందరిమూపుఁ ♦ బ్రాలినిమేషమునఁ
పొక్కట్టుగతి సుఖం ♦ బొనఁగూర్చుచుండఁ
బసిమళానిలములఁ ♦ బండువెన్నెలలఁ
గలకాలనవ్వుచుఁ ♦ గడచునీరేయి
హాయినుండఁగనీక ♦ నందలమునను
ఘనహాటక ప్రద ♦ ర్శనముంచుఁ దెచ్చి
యూరక జాగుచేయుచు ♦ నుండెదనచుచు
రోసమూనకుఁ డోస ♦ భాసమ్మలార!
చెలువంపు నెలయాలి ♦ చెలిగుయ్యిఁబోలె,
క్షణభంగురంబీవ ♦ సంపచ్ఛోభనము
కలకాలమొకరీతి ♦ నిలువంగఁబోదు
సత్యంబుచెప్పెద ♦ సర్వదేశకుని
సత్కీర్తిసంపెల ♦ శాశ్వతసుఖావహము
కాన మీహృదయాన ♦ గణించుకొండి
సమబుద్ధికానందంబు ♦ సమకూర్చుకొటకు
నొకమహోపకారంబుఁ ప్రబ ♦ యోగింతుఁగనుక

పౌరుషంబున ధర్మ ♦ పరిపోషణమున
దక్షిణాపథమేలి ♦ తన తేజమహిమ
కలకాలమును వెల్గు ♦ కాకతీయాంధ్ర
వీరభూపాలుర ♦ విజయసేనలకు
నాయకులుగా దండ ♦ నాథులుగాను
నెలవున్న వెలమభూ ♦ నేతలానాడు
శౌర్యవిఖ్యాతి బా ♦ జనులుగా మెరసి
ఆంధ్ర వెలమాన్వ ♦ యంబులలోన
బిరుదగద్యలు గొన్న ♦ విస్ఫూర్తిగోత్ర
వరుల నప్పారాయ ♦ వంశభూషితులు
ఘన దానధర్మార్థి ♦ ఖనులైనవారు
నుయ్యూరు మాండలి ♦ కోర్వీధవుంసు
లైన రాజారంగ ♦ యాప్పరాయనికి
పుత్రయోగప్రాప్తి ♦ పాత్రధన్యుండు
ఘనకవీంద్రులరీతి ♦ గన్నటియతండు
నాంధ్రాంగ్లభాషలం ♦ దభ్యాసకుండు
సూరివర్యహితుండు ♦ సుజనసమ్మతుండు
లైనట్టి శ్రీవేంక ♦ టాద్యప్పరాయ
రుచిర వాగ్వైభవు నె ♦ ఱుంగరే వీరు!
ఆకవిరాజేంద్రుఁ ♦ డతికౌశలమునఁ
బ్రథమంబునను పృథ్వి ♦ రాయాంతకృతియు
నా వెన్క దుర్యోధ ♦ నాంత రూపకము
వరుసగా మఱికొన్ని ♦ పద్యమాలికలు
లిఖియించి యిప్పను ♦ లీలావతారు

# 3

శ్రీకృష్ణదేవుని ♦ చిత్రచారిత్ర
లందొక్క కథరూప ♦ కాకృతితోడఁ
దనరు గోవర్ధనో ♦ ద్ధారణంబనగ
పలుకు పల్కునఁదేనె ♦ లొలుకరచించె
నానాటకము యిప్పు ♦ డాడుచున్నార
మరసి యానందింపుఁ ♦ డయ్య మీరెల్ల
వేషమిం చెనటంచు ♦ విసువకుఁడయ్య
యారంభ మగు నాట ♦ కాభినయంబు
వినవచ్చునల్లదే ♦ వేణుగానంబు
చెవులఁదన్పుచునుండెఁ ♦ జిఱుగజ్జెరవళి
యాలింపుండదే ♦ యంభారవంబు
కొక్కో యనెడి గోప ♦ కుల కుంతలవినోద
వేణుగోపాలుండు ♦ వేంచేయుచుండె
సావధానులుగండు ♦ సాధువులార!

(పుష్పాంజలివిడచి నిష్క్రమించుచున్నాఁడు.)

శ్రీరస్తు.

శ్రీశోభనాద్రీశ్వరోవిజయతామ్.

శుభమస్తు.

# గోవర్ధనోద్ధారణము.

## ప్రథమాంకము.

### ప్రవేశము—గోపబాలురు.

1 వ గోప—హో! హో! ఇటు. ఇటు. అరరే! చూచితిరా! ఈయాఁబోతు మనమాటలఁ జెవిఁ బెట్టక, తన యిచ్చవచ్చిన దారినే పోవుచున్నదే!

2 వ గోప—మఱలు. మఱలు. ఓహో! దీనికి నోఁదలంతయుఁ బొగ పెక్కి, కొమ్ముల కెగఁబ్రాకినదిరా. కావున నెదురైన వారిపై నంత తలవిసరుచుఁ బైబడుచున్నది,

3 వ గోప—ఓరీ! దీని నాప మన తరముగాదురా! కృష్ణుఁడైనను బలరాముఁడైనను రావలెనురా!

4 వ గోప—ఇదే మన కృష్ణుఁడిటకు వచ్చుచున్నాఁడు. ఓరీ! కృష్ణా!

(మురళి వాయించుచు కృష్ణుఁడు ప్రవేశించును.)

కృష్ణు—ఏమి! ఏమి యుపద్రవము వచ్చినదిరా! అట్లు కేకలు వేయుచున్నారు.

1 వ గోప— కృష్ణా! ఈయాఁబోతు మామాట వినకున్నదిరా! నీవు పోయి దాని నావలకుఁ దోలివమ్ము

కృష్ణు— అదచాల సాధువృషభమే. ఇట్లేల చేయుచున్నది? మీరు దానిని గఱ్ఱలతోఁ గొట్టి రెచ్చఁగొట్టి యుండవలెనురా! (తనచేతిలోనికఱ్ఱను గ్రిందఁబడవైచి) నేనిదే దాని మఱల్చి వచ్చెదను.

గోపాలురు— వలదు. వలదురా! కృష్ణా! అదిచాలఁ గోపముగానున్నది. నీవు కఱ్ఱలేక దాని సమీపింపరాదు.

కృష్ణు— కఱ్ఱయుండిన మాత్రము నాకేట్టి సహకారి యగును? నీవు తెలియ దూరకుండుము. (నిష్క్రమించును.)

3 వ గోప— చూచితిరా! వింత. మనల జూచినంతటనే, కోపులు నిక్కించి, తలవంచుకొని బుసకొట్టుచు వెంటబడినది. కృష్ణుఁ డట్టెపోయి యట్టె మెడ నిమురగా నాతనిచేయి నాకుచున్నది.

4 వ గోప— మన కృష్ణునియొద్ద నేదో మాయ యున్నదిరా.

కృష్ణు— (ప్రవేశించి) ఓరీ! ఆఁబోతు దానికదియే పోయినది చూచితిరా.

1 వ గోప— నీకేమైన మంత్రము వచ్చునా! కృష్ణా!

కృష్ణు— వెఱ్ఱులారా! కన్నులతోఁ జూచుచుండియు నింకను మంత్రమున్నదను చున్నారా? దీని రహస్యము చెప్పెద వినుండురా.

తే. గీ. భూమిపైనైన సాధింపఁ ◆ బోవునపుడు
దాని కుపయుక్తమగుదారిఁ ◆ దలపవలయుఁ;
గరుణచేతను వశమైన ◆ కఠినజంతు
లౌర్యమున నెల్లవేళల ◆ సాధ్యపడవు.

తే. గీ. కాంచరే! మీరు కొట్టఁగఁ ◆ గోపమునఁ గినిసి
పోవఁగావచ్చు వృషభమే ◆ నేను దయను
దువ్వి, శాంతించి తనదారిఁ ◆ దోలఁగ బోయె
మంత్రమని మీరు వెఱ్ఱులై ◆ మదిఁ దలంప.

1 వ గోప—మేము దువ్వఁగవాఁక నెక్కడిది? అది చూడఁగనే మా కైఁబసుచుండె.

2 వ గోప—పోరా! కృష్ణా! ఈ యొక్క-దాని కిట్లుంటివి అదిగో మేము మేపు మందలు చూడుము. నీవు మేపునది చూడుము. నీవన్నియు బలిసి, నవనవలాడుచు, బాగుగఁ జూచిన దృష్టి తగులునేమో యనునట్లుండ, మావి బక్క-చిక్కి- జోరీఁగలతో గొట్టుకొనుచు, నెట్లెట్లోయున్నవి. దీనికేమందువు.

కృష్ణ—అరెరే! ఇదికూడ మంత్రముల మహిమయేనా మీబుద్ధి, నావలెనే మీరుకూడ మీగోవులను శ్రద్ధతోఁ గాపాడుచున్న యెడల నవి యును బలిసి బాగుగ నుండునురా! అట్లుగాక మీరు మీమీ మందల నడవికిఁ దోలి, యేదియో యొక చెట్టునీడను గోలి కాయలో, కోతికొమ్మచ్చులో యాడుకొనుచు మఱల సాయం కాలము దనుక పసులవంకనే చూడక యవి యేపులిపాతనో, యే చిఱుత చేతనో పడినదియైన నెఱుఁగకున్న వాని గతి యెట్లుండునురా! ఇఁక నేనో—

1 వ గోప—నీవు పిల్లనగ్రోవి వాయించుచు గోపికలతో నాడు చుందువు.

కృష్ణ—ఓరీ! నేనెట్లాడినసేమి? నా మిత్రగణములైన గోవులపని యే మఱుచునా! ఉదయమునసే గోవులఁ దీసికొని, లేఁత పచ్చిక గల చోట్లు వెదక మేపుదును. వానికే క్రూరమృగంబుల వల నను భయంబు గలుగకుండఁ దఱచు మందచుట్టును దిరుగు దును. ఏదైన నొక దాని కించుక రోగసూచనలు చూపట్టె నేని, తోడనే మన యయ్యలతోఁ జెప్పి దానికి మందిప్పించు దును. మందలోఁగల ప్రతి గోవునందును స్నేహ భావంబున మెలంగుచు, వాని నన్నిటి నాతోఁబుట్టువులుగా నెంతును ఇఁక నే గోపికలఁగూడి పాడిననేమి? కోఁతులతోఁ జేరి యాడిననేమి?

అదిగాక మీరు దృష్టిదోషము తగులునని యేదియో చెప్పుచున్నారు. శరీర జాడ్యముచే నేదయినఁ గృశించి చెడిపోవలెను గాని, చూచి మెచ్చుకొన్నంత మాత్రమున నేయపాయమైనఁ గలుగఁ గలదా! అదిగో! మీగోవులలో మంచివానికిఁ దలలకు గొమ్ములకు వెండ్రుకల దార్లు, పాదగవ్వల పేరులు నింక నేవేవియో కట్టియున్నారు. అదిగో! ముద్దులమూటగట్టు నా తెల్ల యావున కేమైనఁ గట్టితినా! దానియందము చూడుడు.

సీ. నిండు చందురునివె • న్నెలఁబోలె శాంతమై,
ధవళమై, నునుపైన • తనువుతోడఁ
వాటమౌ వంపుతో • వరమనోహరములై
సిగసిగ ల్గలకొమ్ము • సొగసుతోడఁ
బుణ్యకాంతిముఖంబు • పోలిక సిరులొల్క
ముద్దుమూటలఁగట్టు • మోముతోడ
నమృత భాండముభంగి • నమలమై క్షీరసం
పూర్ణతె నిండైన • పొదుఁగుతోడ

తే. గీ. సమరిభామల నడుమ నా • కమల విహార
ణంబు సేసెడి విధమున • నాలమంద
లందుఁ దిరిగెడునాయావు • నందమెంచఁ
గమలభవునికి నాశ్చర్య • కరముగాదె.

ఏదిరా! దానికింక నేదృష్టియుఁ దగులనేదేమి? పిచ్చియూహల విడిచి మీగోవులఁగూడ భద్రముగఁ గాపాడుదురేని నావాని వలెనే మీవియు బాగుగ వర్ధిల్లఁగలవు.

1 వ గోప—సరియే! సమాధానముల కేమి లెమ్ము. ఎవరిగుట్టు వారు వెలికిఁ జెప్పెదరా. పోనిమ్ము, ఆవులగురించి యిట్లు చెప్పితివి. అద్భుతములైన నీయితర చర్యలగురించి యేమందువు! అవి

మనుష్యుల కసాధ్యము లేకదా! నీయొద్దఁ దప్పక యేదియో యొక గొప్ప మాయయున్నది.

కృష్ణ—ముసలమ్మలతోఁ బాటుగ మీరుకూడ నాపనులఁ బొగడుచున్నారా? నెంచుకంత ధైర్యము గలిగిన నవి యెల్లరకు సులభములే సుమా!

సీ. గాలియైవచ్చు మాయఁ • జాలక ముదుకంసు
ధరఁగూల నాఁదేటి • పరుసుఁదనము
అల్లరింపఁ దేఁపారి • యసురిఁ దెచ్చినవారి
కోపం బడంగించు • టే పటిమము
వడి నింగి కెగయని • నిడుదకాళ్ళబకంబు
మెడఁ ద్రొక్కు టే పాటి • గడుసుఁదనము
మొసలికై పడియున్న • ముసలిపామును దల
మట్టించుటదియెంత • మగతనంబు,

తే. గీ. మదిఁ దలంపక మీరలు • మానవునకు
సాధ్యములు గావనెదు నాదు • చర్యలెల్ల
నెంచుకంత ధైర్యంబుతో • నెసఁగిరేని
సులభముగ మీకుఁజేయంగ • వలనుపడవె.

అదిగాక సోదరులారా! మనసారఁ బూనిరేని సత్యపరాక్రమ సం పన్నులకు నసాధ్యమొకటి యున్నదటరా? మనము సాందీపుని సాకడ చదువు కథలను తలపునకు దెచ్చుకొనుడు.

సీ. సగర నందనులు తు • రగముకై భువిఁ ద్రవ్వి
చెలఁగి మున్నీరుగాఁ • జేయలేదె
ఘనతపోనిధియా న • గస్త్యుండు కోపించి
సాగరోదకమెల్లఁ • ద్రావలేదె?
వీరులౌ వానరుల్ • విక్రమంబున భూరి
గిరివరంబుల నూడఁ • బెకలలేదె!

తనమాట నిలుపంగ ♦ మును గాధినందనుం
డపరదివంబుఁ జే ♦ యఁగలేదె

తే. గీ. శక్తియుతులకు దైవంబు ♦ సాయమున్న
నలవిగానిది చూడ నీ ♦ యవనిలేదు
నీవునేను నయ్యాదిగాంచి ♦ నివ్వెఱఁగున
విపులమాయాబలంబంట ♦ నెత్రిరసము.

1 వ గోప—పోనిమ్ము. కృష్ణా! నీవు మాన్నిహితుఁడవని యడిగితిమి. నీగుట్టు నీవు చెప్పక యేవేవియో సమాధానములు చెప్పుచున్న మరల నోరెత్తము లెమ్ము.

కృష్ణు—చెలికాఁడా! నిజము చెప్పిన నిష్ఠురమా!

2 వ గోప—సరికాని, నీవిన్నినీతులు చెప్పుచున్నావు, నిండె తెలిసినవాఁడవుగదా మొన్న గోపికలు స్నానముఁ జేయుచుండగా వారి గుడ్డలఁ దలపై నిడుకొని చెట్టునకెగఁబ్రాఁకితి వెందులకు? మనలో మనమాట; ఏమిచెప్పుము.

కృష్ణు—(నవ్వి) ఓరీ! ఇదిమీకెట్లు తెలిసినది?

4 వ గోప—ఆగోపిక లేవచ్చి పల్లెయంతయుఁ జెప్పిరి.

కృష్ణు—(నవ్వి) ఓహోహో! అట్లా! నీవేల యీపనిఁ జేయవలెనని యనుకొనుచున్నారు; కావునఁ జెప్పెద, సోదరులారా! నామనసునకు నీభువిఁగల కార్యములందు నెక్కువ తక్కువలు లేవుసుండీ! నాకన్నియు నొక్కరూపే. మాయమ్మ యశోదచెంతఁ బాలు ద్రావుటెంత సులభమో, ఘోర రాక్షసులతోఁ బోరి వారి రక్తము పీల్చుటయు నంత సులభమని నాయభిప్రాయము. ఉట్టిపైనున్న కుండపైఁ దూఁటు పొడుచుట యెంతగొప్పయో, మదించిన యేనుఁగు కుంభస్థలముల భంగమొనర్చుటయు నంతటిదె యని నానమ్మకము. అనేక, వీరులఁ గ్రుంచి, శత్రు

రాజుల పతాకము మోపికొనివచ్చు టెంతఘనకార్యమో, స్నానమాడుచున్న గోపికల వస్త్రములఁ దలపైఁ బెట్టుకొని పారిపోవుటయు నాకంతటి ఘనకార్యమే.

చ. సవలయనుచుఁ గర్మముల ♦ గొప్పది చిన్నది యన్నభేదభా
వవిధము లేదు నాకుఁ బశు ♦ వర్గము లన్నిటిఁ జిన్నకఱ్ఱతోఁ
దవిలి మరల్చుచుంట్ల పడి ♦ భామినియున్, భువనాళి గెల్తువర
జవిఁ బరిగింపనేర్తు నిదె ♦ తెల్పితి నాదగు చిత్రచర్యలన్.

ఉ. బాలకులార! మచ్చరిత ♦ భంగులు నిక్కమెఱుంగ నెవ్వరుం
గాలరు; నాకు నిష్టమగు ♦ చందము వర్తిలుచుందు నెందు; నా
లీలల కిట్టివాబలము ♦ లేదు; జగత్త్రితయంబులోని జీ
వాలిని నాదఁజేయునస ♦ నంత కృపామతిఁ గొంతు నెల్లరన్.

ఉ. కావున మన్మనోవిహార ♦ కార్యము లెప్పుడుఁ జేసి, నిర్దయన్
భావమునుండి తోలి సమ ♦ భంగిని ప్రాణులఁ గూర్మిఁ గాంచినన్
శ్రీవిభవంబుల న్బడసి ♦ చేయుము ఉత్తమమౌ పథంబు; దు
ర్భావముగల్గు కూరులు వి ♦ పత్తులపాలగు ఛుంద్రమిత్రమా!

2 వ గోప—నీవిప్పుడు చెప్పినదాని కంతకు నాకర్థమైనఁ దెలియలేదు. పోనిమ్ము. నీవుమాప మిత్రుఁడవు మేము నీకు హితులము. ఇంత చాలదా!

కృష్ణు—నాకుఁ గావలసినదే యంత, తక్కిన తెలివితేటలున్నను లేకున్నను నాకొక్కటియే.

3 వ గోప—మేము వట్టి మోటువారము. ఐనప్పటికిని నీవారము ఏకే? నీవింతదాఁక జెప్పిన యాపెద్దపెద్ద యాటలలో మమ్ముఁ జేర్చుకొనరాదా?

కృష్ణు—నాకంతకంటెఁ బరమానందము వేఱుగనున్నదా! ఇదిగో ఇప్పుడొక చిత్రము చేసి వేడుక నందుదము.

1 వ గోప— } సరి కాని యిప్పుడు మాకాఁకలిగా నున్నది. ఇండ్లకుఁ
2 వ గోప— } బోయి భుజించి మరల వచ్చి యాడుకొందము.

కృష్ణు—ఇప్పుడంతదూరము పోనవసరము లేదు. ఈయాటలో మీ యాఁకలి గూడ తీరనున్నది.

? వ గోప—కృష్ణా! ఏదైన నగాధ సంకటమున మమ్ముదింపి పో క చేయఁదలచితివా!

కృష్ణు—మిమ్ముదింపి నేనుకూడ దిగరాదనే. భయపడవలదు. అది గో ఆవనములో గొప్ప ధీమంతులుగా నటించుచున్న బ్రాహ్మ ? లేదియో, యజ్ఞము వేయుచున్నారు, కనఁబడుచున్నదా?

1 వ గోప—ఆ!

కృష్ణు—వారల కడకుఁబోయి మీమందఱము చాల నాఁకలిఁ గొ యుంటిమనియుఁ గావునఁ గొంచె మన్నము పెట్టుఁడని ను నడుగుఁడు.

1 వ గోప—పోయినవారల కన్నమిడకుండుట యట్లుండగా వారి ? గభూములఁ జేరఁబోయితిమని తన్ని పంపరుగదా!

2 వ గోప—ఆ! తన్నిన మనమేనా యూరకుందువారము!

కృష్ణు—మీ కెందులకు భయము? మీ యొడలిపై దెబ్బ పడునం ?కు వచ్చిన మూడులోకములు తలక్రిందులు కావలెను. పొం ప.

1 వ గోప—సరే పోయెదము.

(గొల్లలిద్దఱు నిష్క్రమింతురు.)

3 వ గోప—కాని దీనిలో పేసుక యేమున్నది? వారికిష్టమైన ? పెట్టెదరు. లేకున్నఁ బొమ్మనెదరు.

కృష్ణు—నీవ్వారికి చూచుచుండుము.

4 వ గోప—వారు మనకన్నము పెట్టరేమో.

కృష్ణు—పెట్టక పోవచ్చును.

4 వ గోప—ఇంక మన కన్నమో?

కృష్ణు—దానికదియే వచ్చును.

3 వ గోప—అదెట్లు?

కృష్ణు—అదియే దీనిలో వింత. విప్రులు మన కన్నము పెట్టరు. ఐనను మన కన్నము దొరకఁగలదు.

4 వ గోప—ఎట్లు దొరకును? అదిగో! మనవారి నాదారినే తావలదని యెవ్వరో యాటంక పెట్టుచున్నారు.

3 వ గోప—బ్రతిమాలుకొని యదే వనము లోనికిఁ బోవుచున్నారే.

4 వ గోప—మన కన్నము దొరకునట్లు నాకు నమ్మకములేదు.

కృష్ణు—నీవూరకుండవుగా మీకాఁకలిదీరు యోగమున్నయెడల దాని యంతట నదియే యన్నము వచ్చి మీనోటఁ బడఁగలదు. లేక యోగము లేకున్న మీయిండ్లకేగిన మీ యమ్మలుకూడ మీ కన్నము పెట్టరు.

4 వ గోప—అరుగో! మనవారు వట్టిచేతులతోడనే వచ్చుచున్నారు.

3 వ గోప—వెనుక పంపెద మనినారేమో?

4 వ గోప—గొల్లలమైన మనము కోరుటయు వారు పంపుటయుఁ గూడనా! మనవారి మోము మొగములు, తప్పటడుగులు చూడ నాకాశ లన్నియుఁ బోయినవి.

1 వ గోప—(ప్రవేశించి) కృష్ణా! "బ్రాహ్మణోత్తములు యజ్ఞములు చేయుచున్నను గొల్లగాడికెల కన్నమా" అని మమ్ముఁ బారఁ దోలినారు. మమ్ము నిష్కారణముగాఁ బంపించితివి.

కృష్ణు—మీ రెవ్వరి నడిగినారు?

4 వ గోప—ఆ బాపనయ్యలనే.

కృష్ణు—ఈసారిపోయి యాబాపనమ్మల నడుగుఁడు. మీ కన్నము తప్పక పెట్టుదురు.

1 వ గోప — ఊఁ హూఁ! నావల్లకాదు. మగఁడు వద్దన్నఁ బెండ్లాము పెట్టునా?

కృష్ణ — పోనీ! నా పేరు చెప్పి యడుగుఁడు.

2 వ గోప — నీపేరు నీవే పోయి చెప్పుకొనుము.

కృష్ణ — ఓరీ! నేనీయుదయమున వృషభములను దోలికొట్టి యమునకైనఁ బోరాదా?

1 వ గోప — సరియే! ఈసారి వారు పెట్టకున్న మమ్ముల మాటలఁ బొమ్మనవుగా!

కృష్ణ — అట్లే పొమ్ము.

2, 1 గోప — (నిష్క్రమించుచున్నారు.)

కృష్ణ — ఓరీ! లోకములో నెంత గొప్పవారైనను మనపై లేకున్నను వాని యాఁడువారి దయయున్నఁ జాలునని మీ రెఱుంగరు కాఁబోలును.

3 వ గోప — ఈసారి నీమాట నిజమగునట్లున్నదే కృష్ణా!

కృష్ణ — నామాట యెల్లప్పుడును నిజమే. అసత్యమైనను నిజమే. అదిగో! ఘనవారు పోయినతోడనే దాహమిచ్చి లోనికిఁబోయి యన్నపుగుండలఁ దామే మోసి యిక్కడకుఁ దెచ్చుచున్నారు. చూచితిరా? ఈమాత్రము దయలేని యప్పుడు వారి మగలెంత నిష్ఠతో నెన్ని తపస్సులు చేసిననేమి?

(ప్రవేశము — 1, 2 గోపాలురు, వారివెంట నలుగురు విప్రకన్యలు అన్నపుఁ గుండలతో.)

కృష్ణ — తల్లులారా! అడిగినది వెట్టిగొల్లవేగదా యని యావలకుఁ ద్రోలక మృష్టాన్నంబుల దెచ్చుటయు, నందులో మీరలు గూడ వచ్చుటచే మీకు వందనములు. బరువైన యీభాండముల

మోయుటచే అమ్మా! మీకరపల్లవంబు లెంత నొచ్చెనోకదా! మావారిచేఁ బంపకపోయితిరా?

విప్రకన్య—కృష్ణా! చిన్నబిడ్డలగు మీరలడిగినప్పుడు అన్నముఁ దెచ్చుట యొకకష్టమేనా?

కృష్ణు—అమ్మలారా! మీహృదయములు దయారసపూరితములు. కావున నట్లనుచున్నారు. దయయేగదా సకలధర్మములకు మూలకారణము. మరియు, నోతల్లీ! తనకు గలిగియు క్షుదార్తుని నిరాకరించునంతటి పాతకమును, అన్నదానమంతటి మహా పుణ్యమును లేవుగదా!

చ. శ్వపచుఁడటంచు హీనకుల ♦ జాతుఁడటంచు క్షుదార్తునిన్ మదిన్
గృప విడియన్నమీయకుడి ♦ కిందెసు వారలు మేలుఁగాంతురే
తపముల నెన్ని జేసినను ♦ దప్పరి నిక్కలదీక్షతోడనే
జపములఁ జేసినన్ వివిధ ♦ శాస్త్రచయంబుల నెన్ని నేర్చినన్.

1 వ విప్రకన్య—(తనవారితో) ఓసీ! వదినా! చిత్రము. మొదట నీగోపబాలురను నిరాకరించినతోడనే యజ్ఞమాచరించు మన వారికి యాగమంత్రములు స్మరణకు వచ్చుటమానెను. అగ్నులు దీప్తిరగ్గెను. హోతలు కలవరపడఁ జొచ్చిరి. కాని మనము వీరికి అన్నభాండములతో వెడలినతోడనే మరల యజ్ఞకార్యము నిరభ్యంతరముగా కొనసాగ దొడఁగెను. ఆశ్చర్యము!

2 వ విప్రకన్య—ఆశ్చర్యమేమున్నది. అన్నమడిగిన వారిని నిరాకరించిన మనవారికి ధర్మసూత్రము తెలియుటకు యజ్ఞాధిపతియగు దైవము అట్లు చేసెను. ఇఁక పోవుదము రండు. నాయనలారా! మీరు సావకాశముగా భుజింపుడు.

గొల్లలు—అమ్మా! నమస్కారము.

విప్రకన్య—(అన్నపుఁగుండలనిచ్చి నిష్క్రమింతురు).

3 గోప—ఏమోయి కృష్ణా! నీమాట యూరువారందరు నిట్లు వినుటకుఁ గారణమేమి?

3 గోప—అక్కడకుఁబోయి మేము నీపేరు చెప్పినతోడనే యొకరి మొగ మొకరు చూచుకొని లోలోన నవ్వుకొనుచు నట్టికుండల గిన్నెల నెత్తిని మోసికొని పఱుగున వచ్చిరి. ఏమి! రేపు నేఁబిలిచెద. ఏమాత్రము వచ్చెదరో చూతము!

కృష్ణు—నాలోనేమున్నది? ఆయావారి స్వభావమట్టిది.

మృదులములౌ స్వభావములు ♦ మదిని వంతలఁ జూడలేనియా
హృదయపుమార్దవంబుఁ గల ♦ యింతులు "దేహి" యటన్నవానినే
యదనుని భిక్షమీయక యె ♦ యూవలఁ దోలరు, వార లట్టిరా
టవి యొకకారణంబు మగ ♦ లందఱు వారల నెమ్మి గోరఁగన్.

అంతేకాక వయోవృద్ధులు గావుననే పిల్లలఁ గని పెంచువారి వారిపాలఁ బడినది. మన మెప్పుడైన మందల నేమఱినప్పుడు కొట్టునది యయ్యలు బుజ్జగించునది యమ్మలు గదా!

1 గోప—ఔను నీవన్నది నిజమే. మాయయ్య యొకనాఁడు దూడపన్ను లూడఁ జెంపపైఁ గొట్టగా మాయమ్మ నమలుట కిన్ని పేలాలు నోటిలోఁ గొట్టినది.

2 గోప—ఇదేమి? ఇప్పుడు బలరాముఁడు, నందుఁడు వచ్చుచున్నారెందులకు?

కృష్ణు—ఇంకొక వేడుక జరుగనున్నది. గొప్పవేడుక!

1 గోప—ఏమది?

కృష్ణు—వీరింద్రయాగము చేయుటకు నాతో నాలోచింప వచ్చుచున్నారు. దేవలోకములో భోగములన్నియు ననుభవించు యింద్రునికి వేఱుగ యాగమెందులకు? యాగము మాన్పించి, యాగ పదార్థములన్నియు మన వారలు కనుపులింపఁ దినుట కొప్పించెద జూడుఁడు.

ప్రవేశము—బలరాముఁడు; నందుఁడు.

నందు—కుమారా! ఇదేమి? ఈయన్నపుఁగుండలు, ఈకూరముంతలు ఇవన్నియు నెక్కడివిరా!

కృష్ణ—నాయనా? ఈపొగరెక్కిన వృషభము నావలనఁ దోలి వీరు చాల నలసి యాఁకలి గొనిరి. కావున విప్రాంగనల నడిగి వీరికింత భక్ష్యముల పెట్టించితిని.

బల—తమ్ముఁడా! అన్నిటిలో నీవేనా?

కృష్ణ—ఔనన్నా! అన్నిటిలో నేనే, నాతో నన్నియును. అదినాకు పుట్టుకతోడ నున్నవుకు వలదనినఁ దప్పునా?

నందు—కృష్ణా! నీకెప్పుడును బెద్దవారితో నాటయే!

కృష్ణ—నాకున్నమాటయే పెద్దపెద్ద వారితో నాన్నా!

బల—అబ్బ! నీవు చాలఁ జతురుఁడవులెమ్ము. కాని తండ్రిగారేదియో నీతోఁ జెప్పవచ్చిరి. నెమ్మదిగ వినుము.

కృష్ణ—(సంతోషపూర్వకముగా) నాయనా! ఏమది?

నందు—ఆ! మరేమియు లేదు. ఇంద్రయాగము చేయుదము. రమ్ము.

కృష్ణ—(అనిష్టముగ) చేయింపుఁడు.

నందు—నిన్ను బిలుచుకొని పోవుటకు వచ్చితిని.

కృష్ణ—నిర్ణయించు పెద్దలు తాము. నేనేమను?

బల—నీవుకూడ లేని యేసంబరమునకు అమ్మ యియ్యకొనదు.

కృష్ణ—నేఁ జేయుమనినఁ జేసెదరా?

నందు—ఆటంక మేమున్నది?

కృష్ణ—వలదనిన మానుదురా!

నందు, బలరా—(ఊరకుందురు.)

కృష్ణ—పోనీ. మనలో మనమాట. ఒకవేళ మనము చేయుట మా-
నివేసిన నేమగునో?

సందు—ఆ! ఆ! ఎంతమాట! దేవరాజు కోపించును. వర్షములు కురి యవు.

కృష్ణ—ఇప్పుడీ యాగము చేయుటచే మీకేమైన న్యాయము ప్రయోగ యి యున్నదా?

సందు—రెండును విశేషముగనే కలుగును.

కృష్ణ—ఎవ్వరయిన నిట్టిపని చేయుట, చేయకున్న నేరికో కోపము వచ్చు ననియా? లేక దానివలన మనమేదైన లాభము నొందవచ్చు ననియా? రెంటిలో నేది ముఖ్యము.

సందు—లాభము గలుగుటయే ముఖ్యము.

కృష్ణ—ఎవ్వరికయినఁ గోపము వచ్చునని కాదుకదా?

సందు—కాదు.

కృష్ణ—అట్టిలాభ మూవనిచేయకయే వచ్చుచుండ మఱియు నాని చేయుట వ్యర్థమగునా?

సందు—అవును.

బల—లేనిపోని భారము తలపై వేసికొనుటకిదా?

కృష్ణ—ఇట్టి యాగముచేసి యెన్ని యేండ్లయినది?

బల—ఎన్నో మాకు లెక్కా?

కృష్ణ—ఈసారి మానివేయుఁడు. మనకేమి యుపద్రవము గలుగునో చూచెదము.

సందు—ఈసారికి మాత్రము చేసిననేమి?

కృష్ణ—ఇఁకఁ బ్రతి పర్యాయము నీసారియే యందురు. నాయనా! మీకు సందేహమెందులకు?

ఉ. భారుణి గొప్పకార్యములు ♦ దారతఁ జేయుట లాభమేదో చే
కూరు నటంచుఁగాక, మఱి ♦ గొంకక చాలధనంబు నెవ్వరే

నూరిక పాఁబోయి టది ♦ యెప్పుదు దుర్వ్యయ మౌను గానని
ష్కారణ మస్సుచేయుటలు ♦ గాంచిన విజ్ఞులు నింత సేయరే.

ఉ. కారణ మేదిలేక భువిఁ ♦ గార్య మదొక్కటి గల్గదింక నా
కారణకార్య నిర్ణయ మ ♦ ఖండ బలాఢ్యులెయైన దాఁటఁగా
నేరని సృష్టిజాల మొక ♦ సేమముఁదప్పి చరింప దెప్పుడున్
వీరల కిట్టిపొర్పులటలు ♦ మేలొకొ? లెస్సడలంచి చూడుఁడీ.

ఉ. ఇచ్ఛ తెలుంగు కారణ మొ ♦ కింతయు లేక చరించు నాజనుల్
నిచ్చయటంచు బాలకులు ♦ పేడి నవ్వుచుఁ గేలిసేయుదో
సచ్చరిత ప్రభావులయి ♦ సర్వమెఱింగిన మీరె సేయఁగా
వచ్చునె! యూరిలోనఁ దల ♦ వంపుల కోర్చుచు నూరకుందురే.

బల—(కొంచెము కోపముతో) మాటలు చాలనేర్చితివని మేమెఱుఁ
గుదుము లెమ్ము. ఈయాగము మానుటచే నింద్రునికి గోపము
వచ్చిన నీనష్ట పడఁగలవా?

కృష్ణ—అన్నా! ఇంద్రునికిఁ గోపము వచ్చిన నేనష్టపడు విషయము
తరువాత. కాని యూతనికిఁ గోపమువచ్చినను మనకేమి కొఱఁత!
స్వర్గమునకుఁ బోవలసినప్పుడుగదా మనకు వజ్రభయము!

క. కోపింపనిమ్ము శక్రునిఁ
గోపించిన మనకదేమి ♦ కొఱఁతవమును, స్వ
ర్గాపేక్ష సంత్యకాలము
పాపించినవారు గారె ♦ భయ మందఁదగున్

అంతేకాక,

మ. సురనారీ జనలాలనంబుల గనున్ ♦ పాలింతలన్ నాకమం
దురు భోగంబులఁ గ్రింమమీదెఱుఁగకే ♦ యుప్పొంగు దేవేంద్రుఁడీ
ధర నేమూలనో వెఱ్ఱిగొల్లలు తనున్ ♦ దప్పించి యాగంబు సె
యరటంచున్ గ్రహియించునే భయముతో ♦ నల్లాడ నీరాకేటికిన్.

బల—వర్షముఁ గురియింపకున్నఁ జాలదా?

కృష్ణు—ఓహో! తుదకిదియా మీసందేహము? ఆభయము మీకే మాత్రమును వలదు. వాన గురియుటలో దేవేంద్రుండేమి చేయఁ గలఁడు?

ఆ. వె. సంద్రమందు నీరు ♦ చండభానునివేఁడి
దగుల నావిరిగను ♦ నెగసి దివిని
మేఘరూప మంది ♦ మీగని వర్షించు
దీనిలోన నింద్రు ♦ తెలివి యేమి?

బలరా—అట్లయిన నింద్రునికిఁ దురాషాట్టనియు, మేఘ వాహనుఁడని యుఁ బేర్లేల కలిగినవి?

కృష్ణు—నేతిబీరకాయలో నేయి యేమాత్రమున్నదో?

బలరా—(నవ్వి) కృష్ణా! నీవు మాటలలో నతిచతురుడవు. నీతో వాదింపలేము గాని నీవీయాగము నెందులకు మాన్పింప నుం కిట్టితివో నాకుఁ జెల్పుము.

కృష్ణు—మిమ్ములల ననవసరమగు వ్యయమునుండి తప్పించుటకే! వేరే మి యున్నది?

నంద—ఆవ్యయ మిదివఱకే చేయబడినది. యాగ సంభారములన్నియు సిద్ధపఱుపఁబడినవి. ఇఁక మానుట యెట్లు?

కృష్ణు—మఱియు మేలయ్యె. ఆసంభారములఁ జెప్పింపుఁడు. అవన్ని యు నాయింద్రుని మొగముఁ జూడకయుటకు మారు మన మందఱ మిష్టమైన పిండివంటలఁ జేసికొని కడుపులార భుజింతము. బీదలకింత పెట్టుదము. బ్రాహ్మణులకు మంచి దానము లిత్తము. గోవుల కిష్టమైన ధాన్యరాసులఁ బోసి తినఁబెట్టుదము. లేఁగల కడుపులునిండ బాలు ద్రావింతము. గొప్ప పండుగఁ జేసి కొందము.

బల—నీవేదియో చెప్పి యుబ్బించుచున్నావు. కాని యాగార్థముల నిట్లు మార్చినదోషము వచ్చునా?

కృష్ణ—దుర్వినియోగమేమి? దేవరాజు పేరుచెప్పి మంటలోఁ బొఱఁబోయుట సద్వినియోగమా? మనమును మన గొల్లలందఱును మఱియు ననేకులగు బీదవారును, విప్రులును, గోవులును, సంతోషించునట్లాచరించుట దుర్వినియోగమా? పలువురు తామొనర్చుదాని లాభనష్టముల నెఱుంగకుండ నెవ్వరోచేసిరిగదా యని తాముకూడఁ జేయుచు ననుకరణంబే యుత్తమధర్మముచే నెంతురు. కారణము లేకయే వింతగానున్న ప్రతివృక్షమునకుఁ బూజ! ఎత్తుగానున్న ప్రతివల్మీకమునకు బూజ! పనిలేక తనకేదియో దేవత యావేశించినదని వీధిలోగంతులువేయు ప్రత్యున్మాదికినిబూజ! అడవినుండి వచ్చిన ప్రతిసన్న్యాసకునుబూజ! దీనికిఁ బూజ! దానికిఁబూజ! ఎందునకది యంతయు? లోకమంతటిలో మనగొల్లలకే యిట్టి వెఱ్ఱి యూహలు చాలఁగ నావహించినవి. నామాట నాలకించి, మీరు యాగము నీసారికి మానుఁడు. ఇతరులును మనవలెనే మానుదురు. క్రమక్రమముగా మనకులమునకున్న పిచ్చి నమ్మకము లన్నియు వదలఁ గలవు. గొల్లలు సుఖించెదరు.

నంద—ముందెవ్వరయిన మానినచోఁ దరువాత మనము మానవచ్చును.

కృష్ణ—మనము చేయునది మంచిపనియైనయెడల మన మొకరి కొఱకాఁగుటయెందులకు? పోనిండు. మీయాగసంభారముల నంతగా వ్యయపఱుపవలెనన్న నదిగో! అగట్టునకుఁ బెట్టుఁడు. దానిపై మనగోవులు చాలకాలము నుండి మేయుచున్నవి. కాననట్లుచేయుట కృతజ్ఞతా సూచనంబుగ నుండు. అదియుఁగాక మనసంభారముల రసమంతయు భూమిలోఁగలయుటచే నాభూమిపై నిఁక బెరుఁగు కసవు, మఱియు మృదువుగను, రుచిగను నొత్తుగనుండును. ఆవులు బాగుగ మేయును.

బల—కృష్ణా! నీకెందుల కింతగట్టిపట్టు?

కృష్ణు—నాకేమియుఁ బట్టులేదు. నన్నడిగితివి గావున నాకుఁ దోఁచి నట్లుచెప్పితిని. నామాటలు మీకు నచ్చకున్న మీరు పోయి యాగముఁజేసికొనుఁడు. నేనురాను.

బల—(నందునితో) నాయనా! కృష్ణుఁ డేకారణముననో నీయాగము కానీకుండవలెనని తలపెట్టియున్నాఁడు. అతని సమ్మతిలేక మన మది నెఱవేర్పలేమని నానమ్మకము. పోనిమ్ము. ఈసారి మాని వేయరాదా?

నందు—నాకును వానిమాటలు సకారణముగనే కన్పట్టుచున్నవి. అది యుఁగాక యీయాగవ్యయము చాల నధికముగ నుంటచే నది మనము భరింపలేనిదై యున్నది. కావున వీలైన నది తప్పించు కొనవలెనని నాకును దోఁచుచున్నది.

బల—కృష్ణా? నీవంతగాఁ జెప్పుదానిని మేము మాత్రము నిరాకరింతుమా! కాని గ్రామములోని తక్కిన గొల్లలను గూడ విచారించిగాని యిది మానరాదు. కావున నీవుకూడమాతోరమ్ము. వారితోఁగూడఁ జేరి యాలోచింతము.

నందు—ఔనది నిజమే. అట్లుచేయవచ్చును.

కృష్ణు—మేలుమేలు. నావిన్నపమును మీరాలింతురనియే యింతదూరము చెప్పితిని. సరియే. పోదమురండు. గోపకులారా! మరల నిప్పుడే వచ్చి కలసికొందును. లేకున్న మీమందలతో బాటు నామందనుగూడ వ్రేపల్లెకుఁ దోలికొనిరండు. నామందసంఖ్య యెఱుగుదురుగా?

1 గోప—ఎఱుఁగుదుము. అట్లే తోలితెచ్చెదములెమ్ము.

(నిష్క్రమింతురు.)

శ్రీ ర స్తు.

శ్రీశోభనాద్రీశ్వరో విజయతామ్.

శుభమస్తు.

# గోవర్ధనోద్ధారణము.

## ద్వితీయాంకము.

దేవలోకము—దేవేంద్రునిసభ.

ప్రవేశము:—దేవరాజు, బృహస్పతి.

దేవేంద్రు—గురువర్యా! నాకు నేఁడేమో చాల విసుఁగుగా నున్నది. మదిలో నేమియుఁ దోఁచుటలేదు.

బృహ—చాలకాలమేపనియు లేకుండుటచే నట్లున్నది కాఁబోలు.

దేవేం—పనిలేకేమి? ఐరావతమునెక్కి యూరంతయుఁ బరిక్రమించితిని. తరువాత గంధర్వాంగనలచేత సంగీతము విని కొంతకాలము గడపితిని. దేవా! ఏమాలోచించుచున్నారు?

బృహ—ఏమియులేదు. మీవిసుఁగుఁదల యెట్లు మానునాయని యాలోచించుచున్నాను.

దేవేం—అప్సరోంగనలఁ బిలిపించి నాట్యము చేయుమందునా? ఔనది బాగుగానున్నది. ఓరీ! ద్వారపాలకా!

ప్రవేశము—ద్వారపాలకుఁడు.

దేవేం—నాట్యము చేయ సంసిద్ధలైన యప్సర స్త్రీలను ద్వారగానిమ్మనుము.

ద్వార—చిత్తము. (నిష్క్రమించును.)

బృహ—(తనలో) ఈతనిబుద్ధి యెప్పుడును విషయలంపటమై వర్తించు చున్నదిగదా! మార్పుఁజూచెదనా? ఏమో? ఏమికోపమువచ్చునో? ఐనను గురుఁడనుగదా! చెప్పిచూచెద.

దేవే—ఏమట్లూరకాలోచించుచున్నారు?

బృహ—ఆ! వేఱేమున్నది? ఇదిగో! చూచుము. అప్సరలతో నాపైని నాట్యము చేయవచ్చు—కాదు. కాదు. చేయించ వచ్చును. కాని ముందేదైనఁ గొంచెముగాఁ బుణ్య గ్రంథమును జదివి కాలక్షేపముచేసిన బాగుగ నుండునేమో!

దేవేం—మీరింత తలపోసి తుదకిదియా నాకుఁ జెప్పవచ్చినది? ఏదియో వ్రాతపుస్తకమును జదివికొనుచుఁ గూర్చుండుట, వయసు మీరిన మీబోఁటి వృద్ధులకుఁ దగినదికాని, సకల సౌఖ్యముల ననుభవింపఁ దగిన మాకుఁ దగినదికాదు అదియుఁగాక నేనిది వఱకుఁ జదివిచూడని గ్రంథములేవి యున్నవి?

బృహ—ఇదివఱకుఁ జదివియున్నను జ్ఞప్తిలేనిదానిని, జ్ఞాన బోధకముగానున్నదానిని, లేక విష్ణుకథల—

(అప్సరసలు ప్రవేశించి నమస్కరింతురు.)

దేవేం—గురువరా! ఆఁగుము. అప్సరోంగనలారా! మీశక్తికొలఁది నాట్యమాడి మమ్ము సంతోషపెట్టుఁడు.

అప్స—దివ్యాజ్ఞ ననువర్తింతుము. (నాట్యము సల్పుదురు.)

దేవేం—గురువరా! అందఱిలో నూర్వశియే బాగుగ నాట్యముచేయుచున్నదిసుమా! మీకు దేని నాట్యము బాగుగనున్నది? పరీక్షించి చెప్పుము.

బృహ—అడవిలో కట్టెలకుఁ జమవుచెప్పుకొను నాకీ విషయమేమి తెలి యును. (లేచి) రాజా! నాకు వేళయైనది. సెలవిచ్చిన—

దేవేం—(కూర్చుండబెట్టి) వేళయైనఁ దరువాతఁ బ్రాయశ్చిత్తము చేసి కొనవచ్చును లెండు. తాము లేకున్న నాకేమియుఁ దోచఁక పిచ్చిపట్టును.

బృహ—పిరలున్నారుగా?

దేవేం—వారివలన నాకేమియు సంతోషము కలుగలేదు. నేనెప్పుడును జూచుచున్న నాట్యమేగదా!

బృహ—(తనలో) ఈబుద్ధియే మొదట నుండఁగూడదా?

దేవేం—అప్సరలారా! మీరిఁక నాట్యము చాలించిపొండు.

అప్సరసలు—అనుగ్రహింపఁ బడితిమి.

(అప్సరసలు యింద్రునకు మ్రొక్కి నిష్క్రమించుచున్నారు.)

ప్రవేశము—ద్వారపాలకుఁడు.

ద్వార—(తనలో) మారాజుగారేమొ కోపముతో నున్నారు.

దేవేం—ఓరీ! పచ్చి తెల్లమొగముతో నావంకఁజూచెదవేమి? ఉన్నదేమో త్వరగా వెలిగ్రక్కి పోరాదా?

ద్వార—దేవా! యాగసంభారములఁ గొనివచ్చు చారులువచ్చినారు.

దేవేం—చారులు! గీరులు! అందఱకు నన్నుఁజూచుట కిదేసమయమా! వీలుగాదు పొమ్మనుము.

ద్వార—(పోఁబోవఁగా)

దేవేం—ఓరీ! ఏమి! మాటవినకయే యట్లు పరుగెత్తెద వెక్కడకు? వారల రమ్మనుము.

ద్వార—(నిష్క్రమించును.)

దేవేం—దేహా! యాగమనిన జ్ఞాపకమునకు వచ్చినది. భూలోకమున రాక్షసబల మధిక మగుటచేత మనకు యాగ సంభారములే వచ్చుటలేదుగదా!

బృహ—కొలఁది కాలములోనే మనకష్టము లన్నియుఁ గడతేఱును లెమ్ము.

దేవేం—(విసుగుతో) ఎట్లు కడతేఱును? నీవలననా? నావలననా? మన భటులందఱుఁ బిఱికిపందలై, రాక్షసనామము వినునంతనే పునరాలోచనలేక తిరోహితులగుచుందురు.

బృహ—(తనలో) తానుమాత్రమేల రాక్షసులను బొలియింపరాదో? (ప్రకాశముగా) అన్నియుఁ ద్వరలో సరిపడునులెమ్ము.

దేవేం—ఏమి సరిపడును? అసురుల వలనఁ బ్రహారములు మనకు సరి పడునా?

బృహ—కాదు. ఆనాఁడు నీవును, నేనును, బ్రహ్మయు వైకుంఠమున కేగి యిందిరానాథునితో మన బాధలఁగూర్చి మనవిచేసికొనఁగా, భూమిననతరించి, మనబాధల నివారింపఁజేయుదునని వాగ్దానమిచ్చి యుండెనుగదా!

దేవేం—వాగ్దానమిచ్చుటకేమి? వైకుంఠమునఁ విశ్రాంతిగ నుండక మనకొఱకై భూమిలోఁ బుట్టుట కాతనికేమి తొందరవచ్చినది? ఆయనచెప్పినట్లు మన దేవకాంతలఁ జాలమందిని మనకులేకుండ భూమిలోఁ బుట్టఁ బంపితిమిగదా! వారలెక్కడఁ బుట్టిరో యేమైరో? మనకుఁ దెలియలేదు. ఇంతకు విష్ణువు అవతరించినట్లు, మనకు వార్త రానేలేదు.

బృహ—అవతరించెనో, అవతరించునో, అల్పజ్ఞులగు మనకు శ్రీహరి లీలాచర్య లనుభవమునపైగాఁక సులభముగ బోధనకువచ్చునా?

దేవేం—అవతరించునా? ఎప్పుడు? నినుఁబోలిన బృహస్పతులొక కోటి మందియు, ననుఁబోలిన దేవేంద్రు లొకలక్షమందియు, నిష్పత్తి

బ్రహ్మను బోలిన బ్రహ్మ లోకవేయిమందియుఁ బుట్టి చచ్చిన తరువాత—నెన్ని యుగములకో—ఎన్ని కల్పములకో—యవతరించును. సీమాటల కేమి?

ప్రవేశము—భటులు.

దేవేం—ఓరీ! నుసుఁ తినిన పాములవలె నిట్లు నెమ్మదిగా నడచెదరేమి? ఏమివిశేషములు? త్వరగాఁ జెప్పుము.

భటు—దేవనాథా! భూలోకమున రాక్షసుల బాధల వలన యాగసంభారము లెక్కడను దొరకలేదు.

దేవేం—అది మన కెప్పుడు నున్నకర్మమేగదా! క్రొత్తసంగతు లేమి?

భటు—శూరసేనరాజ్యంబున వ్రేపల్లెలోని యాదవులు దేవరపేర యాగ మప్పుడప్పుడు చేయుచుండుట వాడుకయైయున్నది.

దేవేం—ఔను. కాని వారును జాలకాలము నుండి చేయరైరిగా! నేననిన వారికిఁగూడ నిర్లక్ష్యము కాఁబోలు!

ఉ. ఏదియెుమూలఁగాఁబడవి ♦ నెంతయుఁ గుమ్మరి కష్టమందుచుఁ
యాదవులాలమందలను ♦ నట్టిటుమేపుచు, జీవనంబులే
మేదినిసాగఁజేయుటకు ♦ మిక్కిలిఁ గుందుదురంచు నింకనే
నాదరరీతినుంటి నిసు ♦ మంతయుజాగిఁకమీఁద సైతునే.

ఐన నేమి? ఇప్పుడైనఁ దెలివిగాంచిరికదా! ఏవీయాగసంభారములు? వానిని బరీక్షించుచునైనఁ బ్రొద్దుపుత్తము. గురువరా! సంధ్యావందనకాలమైనను నిన్నిం దాఁపి ప్రాయశ్చిత్తమునకు లోఁజేసినందులకై వీరలు తెచ్చినవన్నియు మీకిచ్చెద.

భటు—దేవా! లేవు.

దేవేం—ఏమిలేవు?

భటు—యాగసంభారములు.

దేవేం—ఓరీ! వానిని మీరుదారిలో దొంగిలించితిరి కాఁబోలును' మి
మ్మేపట్ల క్షమింపను.

భటు—స్వామీ!

దేవేం—స్వామియు లేదు. గీమియు లేదు. ఓరీ! ద్వారపాలకా! ఈదు
ర్మార్గుల నైరావతముచేఁ ద్రొక్కింపుము.

భటు—స్వామీ! మామొఱసాంతముగా నాలకింపవలెను.

దేవేం—ఆలకించుట కేమున్నది?

భటు—వారాయాగము నీసారి చేయలేదు.

దేవేం—చేయనిదే యాయాగప్రశంస మెందుకుఁ దెచ్చితిరి. నన్నూ
రక యువ్విళ్ళూరించుట కా?

భటు—మామనవి యొకింత శాంతముగా నాలకింపవలెను.

దేవేం—శాంతముగా నాలకింపకుండుటకు నేను ముంగోపినా? నా
యందీదోషమెప్పుడు కనిపెట్టితిరి?

భటు—దేవరయాజ్ఞకు బాత్రులము.

దేవేం—కానిండు. చెప్పవలసినది త్వరగాఁ జెప్పుఁడు.

భటు—వారీసారికూడ యాగముచేయుటకు సర్వమును సిద్ధము చేయు
చుండిరని విని మేమాస్థలమునకుఁ బోయితిమి.

దేవేం—ఏమైనది?

భటు—వారాయాగమును జేయలేదు.

దేవేం—మఱియేమిచేసిరి?

భటు—తెచ్చిన పదార్థములన్నియు తమ పేరున నాహుతి సేయక యే,
వారే తినివేసిరి.

దేవేం—ఆ! నిజముగనే...

భటు—నిశ్చయముగ.

దేవేం—(ఉగ్రుఁడయి) ఓరీ! గొల్లలారా! నా పేరునఁదెచ్చిన పదార్థము ల మీరనుభవించితిరిగా! ఏమికండకావరము!

ఉ. పాలును పెర్గు మీఁగడలుఁ ♦ బల్మరుబొజ్జలనిండమ్రింగి తో
కాలము నాలవెంటఁజని ♦ కర్షణకెట్టి శ్రమంబులేమిచే
జాలఁగఁ గ్రొవ్వి గొల్లలతి ♦ సాహసులై త్రిదశాధినాథులన్
దేలికఁజేసియాహుతికి ♦ దెచ్చిన ద్రవ్యములన్ హరించిరే.

వీరలకు, వీరిగోగణంబులకు నాదిపోషకుఁడ నేనని యెఱుఁగరు కాఁబోలును! నాకాగ్రహమువచ్చినఁ దుచ్ఛులగువీరెంత! వీరిగోగణ మెంత! రెండేండ్లు మేఘముల వర్షము గుఱియవద్దనినఁ జాలదా?

క. గోవులకు మేపు వోటుల
నే వర్షము గుఱియఁబోవ ♦ నీకుండిన వా
రావులతో వైళంబే
చావరె యెందునను దిండి ♦ సమకూడమిచేన్.

బృహ—వారల్లెందుకు యాగము మానిరి?

దేవేం—ఎందుకు మానిన మనకేమి? మానిరి వారి గర్వమడఁచుటకు మనకది చాలును.

బృహ—ఇంద్రా! క్షమించి నామాట వినుఁడు. వారేదియో యవి లంఘనీయమగు నవసరము లేనిదే యూరక మఖము మానుదురా?

దేవేం—వారిపొట్టలఁ బోసికొనుటకంటె వేఱొక యవసర మేమున్నది? భటులారా! వారు మానుట కంతకంటె నేమైనఁ గారణ మున్నదా?

భటు—ఉన్నది. అది తెలిసికొనుటకే యింత తడవైనది. వ్రేపల్లెలో గొల్లలందఱు దేవరపేర యాగము చేయుటకు సంసిద్ధులయి యుండగా, నందుఁగను నొక పెద్దకుఁ గొడుకైన కృష్ణుఁడను బాలుఁడు వారికేదేదియో బోధించి వారల నివారించెనఁట!

దేవేం—ఆ బాలుఁడు మాన్పించెనా? ఉన్నదియున్నట్లు చెప్పుచున్నావా? లేక సోమ మధికముగాఁ బానముచేసి నీనోటికొలఁదిఁ బేలు చున్నాఁడవా? జాగ్రత్త!

భటు—దేవా! నిజస్థితినుండి వీసమంతయిన నే వేఱుగఁ బల్కుటలేము. ఆ బాలుఁడు చాలఁ జిన్నవాఁడెయట!

దేవేం—ఆబుడుతఁడు చెప్పిన వారుమానిరా? గొల్లలకేమైనఁ బిచ్చిపట్టె నదా? ఆబాలుఁడు వారితో నేమని చెప్పెను?

భటు—అతఁడు వారితోఁ బల్కినమాటలు మేము తెలిసికొనఁ జాలమైతిమి. కాని యాతడు వక్కాణించిన ముఖ్యాంశములు కనుఁగొంటిమి.

దేవేం—ఏమవి?

భటు—"మనకు వర్షములు కురియుటలో దేవనాథుని సాహాయ్య మేమియు లేదనియు, వర్షము నైసర్గికముగాఁ దనంతఁ దాఁగురియక మానదనియుఁ గావున దేవనాథునకు మఖము చేయించుట వృథావ్యయమనియు" బోధించెనఁట.

దేవేం—ఎట్లూ? కండకావరపుమాట లన్నియు నాబుడుతని నోటివెంట వచ్చినవే? వాఁడెట్టి వాఁడు?

భటు—అతనిఁ జూడకుండుటచే వాఁడెట్టివాఁడో మేమెఱుఁగము. కాని యాతఁడెవ్వరిమాటయును వినక యెప్పుడును పలుగాకి పనులు చేయుచుండు నని మాత్రము వింటిమి. మఱియు యాదవులం దఱకు నాతఁడనినఁ జాలభయమును గౌరవమును గూడనఁట!

దేవేం—వాఁడెట్టి వాఁడయిన మనకేమి? మనయెడల నగౌరవముఁజూపి యుండుటచే వారిని దప్పక శిక్షింపవలెను.

భటు—మేమెఱిఁగిన విషయము లందేదియు దేవరకడ దాఁపరాదు. నాబాలుఁడు గొల్లలకొక కొండనుఁ జూపి ఈ కొండపై మన యావులు మేయుచుండుటచే దేవనాథునికంటె నీకొండయే

మనకుఁ జాలనుపకారిగానున్నది. కావున మీ పూజలన్నియు నిఁక నీకొండకుఁ జేయుఁడని పురికొల్పెనఁట!

దేవేం——(కోపముతో) ఓరీ! పొగరుఁబోతా! నన్నింతగా నెగ్గాడితివా? ఇఁక నీపని పట్టితెదను. అకృష్ణుఁడు చెప్పినట్లా గొల్లలాకొండకుఁ బూజచేసిరా!

భటు——ఇంకను జేయలేదు. నేఁడో, రేపో చేయఁబోవుచున్నారు.

దేవేం——ఏమీ! తుచ్ఛులగు మానవుల కింత యదరిపాటా? ఇంత నిర్లక్ష్యమా?

క. పుట్టినదాది జరామృతి
నెట్టనఁబై వచ్చుదేహ ♦ నిచయంబులతో
మిట్టిపడు లేల వీరలు
మట్టించెద వీరినపుడు ♦ మనుచు నెవండో?

ఎట్లు? చూచెదఁగాక! ఓరీబాలకా! దేవేంద్రునికివచ్చు నాగ్రహము, నీవేదిమోదుండగము చేసినప్పుడు నీపై వచ్చిన నీజనని కోపము వలెఁ జల్లారునది కాదుసుమా?

తే. గీ. పుల్లతో నావుతోఁకపై ♦ బొడుచుకొనుచు
"చొ, చొ, చో" యటంచు మనునీవు ♦ పెచ్చుపెఱిగి
దేవనాథునికెదురుగాఁ ♦ దిరిగినావె!
పురుగు పెద్దమంటలపైకిఁ ♦ బోవునటులు.

వర్షములఁ బట్టుమని యొక రెండేఁడు లాఁపితినా మీగోవులు మేయుటకు గడ్డియే లేకుండును. అప్పుడు నీకడుపునింపుకొనుటకు వాని చన్నులలోఁ బాలులేక, నీవు కొన్నినాళ్లాకలితో మలమల మాడినఁగాని నీయొడలికొవ్వు కరఁగదు. తలపొగరు తగ్గదు. దేవనాథుఁడు నెవరనుకొంటివో? ఓరీ! భటులారా! మేఘదేవతలఁ బిలిచికొనిరండు.

భటు——(నిష్క్రమింతురు.)

బృహ—(తనలో) నేడీతని కేలొకో తగినకారణము లేకయే, కోపము అతిశయముగా వచ్చుచున్నది? ఈతనివైఖరిచూడ నీతనికిఁ గొలఁదికాలములోనే యేదియో సంకటము వచ్చునట్లున్నది.

తే. గీ. తగినకతమింతలేకయే ♦ మిగులజనుఁడు
కోప, చింతాభయంబులఁ ♦ గూడియున్న
వాని పర్యవసానంబు ♦ లైన వెతలు
కొలఁదికాలంబులోనె రాఁ ♦ గలవు నిజము.

(ప్రకాశముగా) రాజా! పిల్లవాఁడువద్దనిన యీవవులందఱొక్కసారిగ నీముఖము మానుదురా? వింతగానున్నది.

దేవేం—వింతయగుగాక! వారు మనల ధిక్కరించుట నొప్పనేరమందురా? కాదా?

బృహ—వారుచేసినది గొప్పనేరమె! చాల గొప్పనేరము. కాని యీ పిల్లవాఁడు బోధించుటేమి? పెద్దవారు వినుటయేమి? చూడగా నేదియో వింతగానున్నది. ఇదిగో! చూచుము. మనమందఱము మనపిల్లల—మనకుఁ బిల్లలులేరుగా—లోకములో సాధారణముగాఁ బెద్దవారిబోధనలు చిన్నలువినుట సహజము. ఒకవేళ నేకుఱ్ఱఁడైనఁ బెద్దలకెదురాడిన రెండుతాడనము లొసఁగి వానికి బుద్ధితనిమాటపై వర్తింపుటయా?

దేవేం—కనులకుఁ బొగలెక్కి కండకావరమున మతులుసెడినవారందఱివలె సత్పథమునఁ జరింతురా?

బృహ—అటుకాదు. దీనిలో నేదియోవిశేషమున్నది. ఇప్పుడు మీరు వర్షము మాన్పించినను వర్షములేమిచే వారికి బాధ కొంతకాలమునకుఁగాని కలుగదుగదా? కొంతకాల మాఁగి దీనియుదంతమంతయు బాగుగ నెఱిఁగిన తరువాత నేకార్యమునకుఁగడఁగిన నేమిబాధ యున్నది? తొందరపడిన నేరికి హాని చేయుదుమో?

ఒక్కనిపై కోపించి వర్షముల మాన్పిన యెడల లోకమున కంత టికిని హాని కలుగునుకదా? ఎలుకను సంహారించుటకు యిల్లు కాల్చుటయను సామెత భూలోకమున నున్నది.

దేవేం—కావున తమయుద్దేశమేమి?

బృహ—వీరు యింద్రయాగము సలుపకున్ననేమి! మనకాహుతినిచ్చు వారెందఱు లోకములలో లేరు?

దేవేం—మీరు ఎప్పుడు మమ్ము విక్రమింపనీక, యిట్లే నివారించుచుం దురు. దానవులఁ జూడుడు. వారి మానసేచ్ఛలే నీతులుగను, వారి సౌకర్యములే ధర్మములుగను, విజృంభించుచున్నారు గాని నీబోటి ముసలి మూల్గులనే వేదమంత్రములుగాఁ బాటించుచు న్నారా? హిరణ్యగర్భుండును, ఫాలనేత్రుండును, వారికిఁ బ్రత్య క్షమై వారికి వరములిచ్చుచున్నారు గాని మన దేవతలకేమైన నిచ్చుచున్నారా? విష్ణునంతటివాఁ డవతారములెత్తుట వారికొ ఱకా నాకొఱకా? తుదకోడి చచ్చినఁ జచ్చిరిగాక! మనదేవత లలో నొక్కఁడైనను హిరణ్యకశ్యపుని యంత కీర్తి గడించెనా? రావణునియంత శౌర్యముంగాంచెనా? ఇప్పుడు భూలోకమునఁ దేజరిల్లు శిశుపాలునియంత పేరైనఁ బొందెనా? ఎందువలన వా రలకును మనవారికి నింత తారతమ్య మున్నది. మనవారలెట్లు పోయిన నేమివచ్చునోయని వెనుకాడుట చేతను, వారు వీరు లై విచ్చలవిడిగ వర్తించుట చేతను—సాహసమే యన్నిఁటికిని ప్రధానము. కావున నన్నిందుండి నిరుత్సాహపఱుపకుఁడు.

బృహ—(తనలో) ఓహో! రసము ముదురు చున్నది. ఈముంగోప మీతని నూరక పోనీయదు. ఐన నింకొకసారి చెప్పిచూచెద. (ప్రకాశముగా) రాజా! నీమేలుగోరువాఁడ నగు నామాట నింత యాలింపుము.

సీ. దేవేంద్ర! నీమేలు ♦ దినదినంబును గోరు
గురుని మాటకు కిన్క ♦ గొనకుమయ్య
గొప్పవారలకైనఁ ♦ గొలఁదికార్యంబైన
నూహించి యొనరించు ♦ టొప్పునయ్య
కోపంబు మదిఁబూని ♦ పాపపుణ్యంబుల
దెలియ కెవ్వరికెగ్గు ♦ దలపకయ్య
చిన్నబాలుఁడు గాన ♦ శిక్షింతు మవలీల
ననినమ్మి వానిపైఁ ♦ జనకుమయ్య
తే. గీ. గొల్లకుఱ్ఱఁడల్పుఁడే యంట ♦ కల్లయయ్య
యేనతని నొక మిన్నగా ♦ నెంతునయ్య
యెట్టిపుట్టులో నేపాము ♦ యెఱుఁగమయ్య
యాతురతమాని లెస్సగా ♦ నరయుమయ్య.

దేవేం—ఆవెఱ్ఱిగొల్లలు మమ్ము ధిక్కరింపఁగలరా?

బృహ—ధిక్కరింపఁజాలరను కొనుము. ఐనను గొంచెమాఁగి సంగతుల నెఱుఁగుదుము. ఒకవేళ నీవిప్పుడు వర్షముని లిపినను కాలమునకుఁగాని వారికి బాధగలుగదు.

దేవేం—అట్లేని వారి గర్వప్రహారణము చేయుటకొక విధము గలదు. అనావృష్టివలన బాధ కొంతకాలమునకుగాని మానవులకుఁ దోపదు. అతివృష్టివలని సంకటము అప్పుడే తెలిసివచ్చును. ఏ! మేఘదేవతలు రారో?

మే. దేవ—(ప్రవేశించి) స్వామీ! ఏమి సెలవు?

దేవేం—మీరీక్షణమే మీమీ మేఘజాలములతో -ఏవి? ప్రళయ కాలమున వెడలు మేఘములన్నిఁటితో భూలోకమున వ్రేపల్లె యను గ్రామంబుపై కేగి యాపల్లెయు నాపరిసరప్రదేశములన్నియును నాలుగైరావతములంత లోతుగల జలార్ణవమగునట్లుగ

నఁబిములతోఁ, బిడుగులతో, మెఱుపులతో, హిమ శిలా వృష్టిఁగురిసి యీప్రదేశమునంతను నాశము చేయవలెను. అట్లు చేసి వచ్చితిరేని మీరు కోరుకొనినవెల్ల నిచ్చి సంతోషపెట్టు వాఁడ. నేనుఁగూడ నైరావతమునెక్కి మీవెంటవచ్చెద. బృహస్పతీ! తామింక నాశ్రమంబునకు విచ్చేయుఁడు.

(నిష్క్రమించును.)

బృహ.—ఆహా! ఎంతవాఁడయిన నేమి:

క. కాలము దాపురింపమతఁడేఁ ♦ గాంచఁడు మేలునుకీడుఁగాని, తా
మోహిలనెవండున్యాయమగు ♦ ముచ్చటయొక్కటి చెప్పఁజూచినన్
గాలునియట్టు లుగ్రుఁడయి ♦ కట్టడిమైకనుఁదిట్టు, వానికిన్
బోలినశిక్షయాదనుక ♦ బుద్ధియుఁగల్గదు కాలవక్రతా
లీలనెదుర్కొనం జనఁగ ♦ లేఁడు విధాతయు వానితాతయున్.

(నిష్క్రమింతురు.)

శ్రీ ర స్తు.

శ్రీశోభనాద్రీశ్వరోవిజయతామ్.

శుభమస్తు.

# గోవర్ధనోద్ధారణము.

## తృతీయాంకము.

గోవర్ధనగిరిప్రాంతభూమి.

ప్రవేశము—కృష్ణుడు; 1, 2, 3, 4 గొల్లలు. కొందఱుగోపికలు.

గోపిక—ఏమికృష్ణా! నీపట్టుదల! ముసలివారినందఱను నీమాట చాతుర్యంబున నీదారికిఁ ద్రిప్పి, దేవేంద్రునిపేరఁ బెట్టవలసిన యాగ సంభారముల నీగట్టునకుఁ బెట్టించుచున్నావు!

కృష్ణు—పెట్టుటకదా కావలసినది; ఇఁక నెవ్వరిపేరఁ బెట్టిననేమి? అన్నియుఁ దుదకొకస్థలమునకే పోవునుగదా!

తే. గీ. ఏరికిచ్చిననేమవి ♦ యెల్లఁదుదకు
దైవసంప్రీతి కరములై ♦ తనరుచుండు
నీరమేనదిలోఁబడి ♦ పాఱుచున్నఁ
గడకు నాగరంబునుజేరి ♦ కలియుఁగాదె?

2 గోప—కృష్ణా! అదిగో చూడుము. నీవుచెప్పినప్రకారము మన మం దలన్నియు గొండచుట్టు నెట్లుప్రదక్షిణము చేయుచున్నవో

కృష్ణ—అవును! ఆహా! వానియందము చూడుము.

సీ. సొగసైన నడకతో ♦ సుందరాకృతితోడఁ
గోమలాంగులఁబోలు ♦ గోవులవిగొ!
తల్లియావులచుట్టుఁ ♦ దాండవంబొనరించి
ముద్దులొల్కెడి లేఁగ ♦ మూఁకలవిగొ!
పెద్దఱంకెలతోడ ♦ పెనుమూపురములతో
బుసపెట్టి చనెడి నాఁ ♦ బోతులవిగొ!
వడిగల్గిన నట్టులు ♦ నసివాఱుగిత్తలు
రాజిల్లిలాగు గో ♦ రథములవిగొ!

తే. గీ. అమృతపాయసంబుల నిండి ♦ నట్టికుక్షి
చయములతో నొప్పుగోపాల ♦ సంఘమదిగొ!
చలిత తనుమధ్యవిలసన ♦ సన్మరాళ
గమనముననేగు గోపికా ♦ కాంతలవిగొ!

బల—చూచితిరా! ఆయుత్సవ మంతయు నెంతసంతోషకరముగా గిరిప్రదక్షిణముచేసి పల్లెలకుఁ బోవుచున్నదో.

3 వ గోప—ఆహా! బొజ్జనిండ తియ్యని వంటల భుజించితిమి. చల్ల గాలిహాయిగా నున్నది. ఈపచ్చికపట్టుల పండుకొని హాయి గా కథలుచెప్పుకొందము.

(అందఱు పరుండుదురు.)

1 వ గోపిక—చిన్నికృష్ణా! నేనుపాయసము బాగున్నదా! లేక పర మాన్నమా!

కృష్ణ—నీవేదివడ్డించితివి?

1 వ గోపిక—పాయసమే;

కృష్ణు—అదే బాగున్నది.

1 వ గోపిక—కాదు. మఱచితిని. నేనువడ్డించినది పరమాన్నమే.

కృష్ణు—ఔనే! జ్ఞప్తికివచ్చినది. అదే రుచిగానున్నది.

1 వ గోపిక—కల్లలమారి పిల్లడా! నేనేదివడ్డింపలేదు.

కృష్ణు—కావుననే అందును నాకురుచింపలేదు.

2 వ గోపిక—ఆ! ఏమీ! వడ్డించినదినేను.

కృష్ణు—ఓహో! అట్లనే! కావుననే కడుపునిండ జుర్రితిని. మా అన్నయ్యనడుగుము.

బలరా—ఓయిబాబు! నాకు మాటాడుట కోపికలేదు. నిద్రవచ్చుచున్నది.

నందు—అవును. కడుపునిండ దినినవాడు విశేషముగ మాటాడకూడదు.

1 వ గొల్ల—కొంచెమునేపు నిద్రబోవుదము.

అందఱు—అవును. అవును. అట్టిట్టు పొరలి కొంచెము కన్నుమూసినగాని ఆయాసము తీరదు.

అందఱు—అవును. ఆ! ఆ! (అని ఆవులించుచు గుఱ్ఱుపెట్టి నిద్రింతురు)

(ఉఱుములు, మెఱుపులు.)

కృష్ణు—అన్నా! లెండు. లెండు. గాలివాన వచ్చుచున్నది.

(అందఱు మేల్కొందురు.)

1 గోప—ఇప్పుడేగదా! కన్ను మూసికొన్నాము. ఆఁ! ఆ! (ఆవులించును.)

2 గోప—అప్పుడే యామబ్బులన్నియు నాకాశము నిండినవేమి?

3 గోప—ఇంతనల్లని మబ్బుల నెన్నఁడును చూడలేదు. రాత్రివలెఁ జీఁకట్లు క్రమ్ముకొని వచ్చుచున్నవి.

కృష్ణు—మబ్బు క్రమ్ముకొనినప్పుడు చీఁకట్లు పడకుండునా? మీ కెందు నకీవింత?

1 గోప—అరెరే! ఆపెను గాలి యప్పుడే ఇక్కడకు వచ్చినది.

కృష్ణు—(చప్పటులఁగొట్టి నవ్వుచు) ఓ హో హో! అటు చూడుఁడీ? గోపికల కేశబంధములు ముడివీడఁ దుమ్మెదల చాలువలె గాలి కెల్లిగురు చున్నవో?

1 గోప—కృష్ణా! నీకెప్పుడు గోపికల మెచ్చుకొను సంబరమేనా?

కృష్ణు—ఇప్పుడంతకంటె నుపద్రవ మేమివచ్చినది?

1 గోప—ఏమివచ్చినదా? అబ్బ! ఈగాలి యెంతచల్లఁగా నున్నది? నడిసీతువునందుఁ గూడ నింత చల్లదనము లేదే! దౌడలాడు చున్నవి.

2 గోప—(వణఁకుచు) మండువేసవి కదాయని, కప్పుకొను కంబళుల నైనఁ దెచ్చుకొనలేదు.

౪ వ గోప—అందఱమీ చెట్టు మొదటి కేగుదము రండు. (లోపల నేదియో విఱిగినధ్వని యగును) అమ్మయొయ్యో! అంత పెద్దచెట్టే విఱిగినదే. ఏమి యీగాలి బలము!

1 గోప—మనము దానిక్రిందకుఁ బోయిన తరువాత విఱుగక ముందు గనే విఱిగినందునకు దానికొక దండము పెట్టుము. (లోపల నుఱుము మెఱుపులసడి) అయ్యయ్యో! ఈ గాలితోఁ బాటు వాన కూడనా! ఇట్టి యుఱుములను, మెఱుపులను, నేనెప్పు డును చూడలేదే?

2 గోప—ఓరీ! మనము త్వరగా నిండ్లలోనికిఁ బోయి దాఁగికొందము రండు!

3 గోప—పాపము మన గోవులో?

2 గోప—వాని సంగతి రేపు చూడవచ్చును లెమ్ము!

కృష్ణు—స్నేహితులారా! నేనుండఁగ మీకేభయ మెందులకు? ప్రకృతి స్వభావమునఁ గాలమునకు వచ్చు వానకే మీరు తల్లడిల్లు చున్నారా? ఈవర్షమెంత సొగసుగఁ గురియుచున్నదో చూడుఁడు!

1 గోప—ఇదియేమి సొగసుబాబూ! నీకిది యొక యాటగానున్నది కాఁబోలును! మాకుఁ బ్రాణసంకటముగా నున్నది. ఓ. ఓ. చలి. చలి.

(పైనుండి చినుకులును పెద్దవడగండ్లును బడుచున్నవి.)

3 గోప—బ్రతికియున్న బలునాకేరి కొని తినవచ్చును. పరుగో! పర్లెకు?

(కృష్ణుఁడుగాఁక కొందువవారు కలవరపడుచు పరుగెత్తి నిష్క్రమింతురు.)

కృష్ణు—(నవ్వి) నేఁదలంచినంత యైనది. మంచి వినోదము జరుగుచున్నది. మఖము మాన్పించితినని కోపించి దేవేంద్రుఁడీపని చేయుచున్నాఁడు. పాపము మాగోల్లలందఱు ఱాళ్ళవానకు భీతిల్లి యిండ్లకు ఱికినారు. వృథాప్రయాసముకాని దేవనాథుని ఱాళ్ళ వానకాయిండ్లు మాత్రమాఁగునా? (ఉఱుములధ్వని) నిజము. అదిగో! మావేప్రపల్లె పైనే విశేషముగా ఱాళ్లు పడుచున్నవి. (ఆవులఅఱచుధ్వని) అరెరే! ఈసందడిలో నా ప్రియమిత్రములగు గోవుల మఱచితినే. అవియు ఱాళ్ళవానకు భయమంది యార్చుచున్నవి అకటా! హానిమనిన నీజంతుజాలమున కంతకు నింత భీతి యెందునకో! (లోపలధ్వని) ఓహో! వేప్రపల్లెపైఁ బిడుగులు పడుచున్నవే! మావారే యపాయము నొంది యుండరుగదా! ఇండ్లు పోయినను మావారికి ప్రాణాపాయము గలుగకుండుగాక! ఇఁక దేవేంద్రుని యిష్టము వచ్చినట్లు ఱాళ్ళ రువ్వనిమ్ము.

(తెఱలోఁ గలకలము)

అరరే! చిత్రము! ఎరికి అపాయముఁ గలుగకున్నను అందఱును భీతిల్లి మావారిలా యిల్లుగూల నీయింటిలోను, నాచెట్టు విఱుగే

నీచెట్టుక్రిందను, నీపుట్టక్రిందను, నీపుట్టగూల నింకొక పుట్టచాఁటునకు నెట్లుఱుకు చున్నారో! వెఱ్ఱులారా! ఆ ప్రయత్నము లన్నియు మిమ్ముఁ గాన లేవుసుఁడీ! నాకడకు వచ్చినఁగాని మీకు క్షేమము దొరకదు.

తే. గీ. ఆపదలు గల్గునపుడు జీ ♦ వాళి యెల్ల
భీతినట్టిటు గొట్టుక ♦ పెనఁగుకంటె
జిత్తమున నన్ను నొక్కింత ♦ చింతసేసి
శరణటన్న బాధలవెల్ల ♦ సమసిపోవె.

ఓహో హో! పల్లెలోని యిండ్లన్నియుఁ బడిసమాప్తి యగుటచేఁ గాఁబోలు మాగొల్లలందఱు, వీఱిగి పైబడునను భయముచేతఁ జెట్లక్రింద దాఁగనొల్లక బయలున నట్టిటు లుఱుకుచున్నారు. ఏమి వీరి యున్మాదము. పరుగిడినంతనే పైనుండి పడుఱాళ్ళదెబ్బలు తప్పునా? ఏగీ మాయమువీరులందఱును? ఇప్పుడు వారివీరత్వమేమి పనికివచ్చును?

(లోపల) కృష్ణా! ఎక్కడనున్నావు?

కృష్ణు—వీరెవరు? ఓహో! నాగోపికలారా! ఇంతసేపటి నుండియు వీరి సంగతియే మఱచి పోయితిని. పాపము వీరు చలిలోఁదడిసి యెంత వణఁకుచున్నారో! అకటా! వీరిలో ముసలివారు కూడఁ జాలమంది యున్నారే! ఇదిగో! ఒక గోపిక యిటు వచ్చుచున్నది.

ప్రవేశము—గోపిక.

గోపిక—కృష్ణా! ఎక్కడ నున్నావు?

కృష్ణు—ఇక్కడ! ఇక్కడ! ఏమి యుపద్రవము వచ్చినది? అట్లు కేకలు వేయుచున్నావు!

గోపిక—నీవు చూచుచునే యుపద్రవమేమియని యడిగెదవా? ఇదిగో నాభుజమును జూడుము. తాటిపండంత ఱాయి పడఁగానది యెంత నొచ్చుచున్న దనుకొంటివి?

కృష్ణు—ఏదీ చూడనిమ్ము! (భుజముపైఁ జేయిమోపి) ఇప్పుడేమాత్రము నొప్పిగా నున్నది?

గోపిక—మాధవా! నీవు నిజముగా మాపాలిటి దేవుడవే. నీవు చేయి మోపినంత మాత్రమున నాబాధయంతయుఁ బోయినది.

కృష్ణు—తక్కిన వారందఱు నెక్కడనున్నారు?

గోపిక—అందఱుఁ దలయొక దిక్కునకుఁ బోయి యున్నారు. కాని కొందరుమాత్రము మీతలిదండ్రుల చుట్టును జేరి మీమూలమున నింత వచ్చినదని వారిని దూషించు చున్నారు.

కృష్ణు—ఆ! నిజముగనా! మాయమ్మను, మాయయ్యను దూషించుచున్నారుగా! వారి తప్పేమున్నది? నీవిప్పుడే మఱలఁ బరుగెత్తి పోయి నేనిందున్నానని చెప్పి నాకడ కందఱను బిలుచుకొని రమ్ము. మీకేయుపాయమును లేకుండఁ గాపాడెద.

గోపిక—నీయొద్దనుండి పోయిన మఱల నాపై ఱాళ్లుపడునేమో!

కృష్ణు—ఏమియుఁ బడవు. ఒక్క పరుగునఁబోయి వారలందఱను రమ్మంటి ననుము. నాముద్దులాడివిగా! పొమ్ము.

(గోపిక నిష్క్రమించును)

కృష్ణు—ఆట ముదిరినది. చూచి నవ్వదగిన సమయము దాటిపోయినది. వీరిని గాపాడవలసిన యదను వచ్చినది. దేవేంద్రుఁడతని పంతముఁ గెలిచెనని యువ్విళ్లూరు చున్నాఁడు గాఁబోలును. ఎట్లు నేనుండగనే వాగొల్ల లొకనిచేత లొంగుదురా? వారి కొకనిచేత భయముకల్గునా! చూచెదగాక!

(గోపల నావులఱచు నడి)

అకటకటా! నాముద్దు దూడలపై నింతైన దయలేక కఠినశిల లెట్లు గురియించు చున్నాడు! అమ్మా! నాకన్నుల పండువగు తెల్ల యావు మెడనుండి రక్తము కారుచున్నదే. ఱాతిదెబ్బ తగిలినది గాఁబోలును! ఓ! దేవేంద్రా! ఇంక నీగర్వభంగము కాగలదు

(ప్రవేశము—గొల్లలు, గోపికలు, బలరాముఁడు, నందుఁడు.)

బలరా—తమ్ముఁడా! నీవుచేసిన దాని పర్యవసానమును జూచితివా?

నందు—కుమారా! దేవనాథున కాగ్రహము వచ్చునని నేను ముందే చెప్పలేదా!

1 గొల్ల—మేమిప్పు డెందుఁ బోయెదము?

2 గొల్ల—ఈ రాళ్ళవానలో బ్రతుకుట యెట్లు?

గోపికలు—మాధవా! మాగతి యేమిచెప్పెదవు?

కృష్ణు—ఆఁగుఁడు! ఆఁగుఁడు! అందఱొక్కసారిగా నన్నడిగిన నేరికి బదులుచెప్పవాఁడను?

బలరా—మేమందఱ మొక్కసారి రాళ్ళదెబ్బలు తినలేదా?

కృష్ణు—కొంచెమాఁగుఁడు! భయమేమియు లేదు. ఈవర్షమిప్పుడే తగ్గిపోఁగలదు.

(రాళ్ళవాన పడుచున్నది.)

గొల్లలు—అమ్మయ్యో! రాళ్ళవాన మావెంటాడుచున్నది. బాబో! ఈదెబ్బలకుఁ దాళలేము. దేవుడా! ఇంకెందైన బాఱిపోయెదము.

(గోవుల యార్పులు)

బలరా—కృష్ణా! ఏమి యూరకున్నాఁడవు?

గోపికలు—స్వామీ! మమ్ము రక్షించుటకిదియే సమయము!

కృష్ణు—అన్నలారా! అక్కలారా! భయమందకుఁడు. ఓరీ ఇంద్రా! కృష్ణుని కడనున్న గొల్లల నొంచుట సులభ మనుకుంటివేమో పొరఁబడితివి?

శా. ఓరీ! గొల్లలు వెఱ్ఱిగొల్లలని నీ ♦ వుద్రేక సంరంభివై
కారుణ్యంబును మాని వృద్ధజనులుం ♦ గాంతామణుల్బాలురున్
ఘోరార్తింబడికుంద; భీతిఁగలఁగన్ ♦ గోయూథముల్; రాళ్ళమా
పై రువ్వన్, భవదీయ మేఘవితతిం ♦ బంపించితే! దుర్మతీ!

ఉ. పంపిన నీదుమేఘములు ల ♦ పారముగా శిల లెన్నొ మాపయిన్
నింపినఁ, గాలుచీఁకటులు ♦ నిండినఁజేరి మహాబలుంపు బ
ల్తెంపుగవీచినన్, యశని ♦ తీవ్రతతో పయినాపుచున్న మా
కొంపలు గూలిపోయినను ♦ గొల్లలు లొంగరునీకు నింతయున్.

చ. బలముగలాఁడ నంచు సుర ♦ పట్టము నొందినరాజ నంచు, నా
పిలుపున నెల్లలోకములు ♦ భీతిఁ గలంగెడునంచు, వజ్రముం
గలుగు నటంచు నీవుకడు ♦ గర్వముతోడఁ దలంచితేమొ? నా
చెలులగువీరి నేమియును ♦ జేయఁగఁజాలవు నీబలంబునన్.

శా. లేరే, యింద్రులుమున్ను, దేవతలఁ బా ♦ లింపంగ? యాగాళిఁ గ్రై
కొరే! వారలు నీవలెన్ జనులపైఁ ♦ గోపించి, యేపాప సం
చారం బెర్గనిగోగణంబుల వడిన్ ♦ జంపంగ రాల్రువ్వఁగా
రారిట్లీన యెఱుంగనే సురపురీ ♦ రాజేంద్రులం బెక్కుఱన్.

ఉ. నాయెడఁ గోపమూని సుర ♦ నాథుఁడవయ్యును నన్ను నేమియున్
జేయుంగలేక దీనులగు ♦ చిన్నల వృద్ధులఁజూచి వీరిపై
నేయఁగఁబూనినా వహహా! ♦ యేమని చెప్పుదునీదు శౌర్యమున్,
న్యాయము, దోషి నన్విడచి ♦ యందఱి నేచుచునుండఁ బాడియే.

ఉ. గొల్లల నొంపఁజాలితిని ♦ కోరికదీరెఁగదా యటంచు నీ
వుల్లసమాడకేయిచట ♦ నుండఁగ గొల్లల కెగ్గురాదు వే
పల్లెయు, నిండ్లుఁ బోయినను ♦ భద్రముసేసెదఁ జూడువీరి, నీ
వెల్లియు నాపయింగురియు ♦ మిచ్చతెఱంగున రాలవానలన్.

(వెనుకకుదిరిగి తనవారినిజూచి.)

తే. గీ. భయముఁ జెందకుఁడింక మీరా ♦ పయినిరాళ్లు
గురియునంచు నేనిదిగో యీ ♦ గిరివరంబు
నెత్తిగోవులకును మీకు ♦ నెల్లరకును
పట్టెదను దగునాత ♦ పత్రముగను.

రంమ, నాతోడరంమ. నేనుండ మిమ్మాపద్రిపయేమి చేయఁ గలఁడు?

బలరా—పిమ్మఁడా! ఏమనుచుంటివి? ఈపర్వతమునెత్తి మాకు గొడు గుగాఁ బట్టెద ననియా?

అందఱు—మాధవా! మముఁ ద్వరగా నెందైనఁ గొనిపొమ్ము. ఈరాళ్ళ దెబ్బలకుఁ దాళఁజాలకున్నాము.

కృష్ణు— వేఱుగా శంకసేయక నాతోడరంమ. (పర్వతమును సమీ పించి) పర్వతరాజమా! నీవిన్ని దినముల నుండియు మాగోవు లకు వలయునంత కసవు నిచ్చుచుంచుటచేతనే గాక, మాపర్వత కులమున కంతకును శత్రువగు దేవేంద్రుడు నావారిని నిలువ నీకుంమటచే నీయుదనున నీవు తప్పక మాకుఁ దోడ్పడి యుప యోగకారి వగుదువుగాక!

తే. గీ. గిరివరా! రాళ్లుమాపైని ♦ గురియకుండ
నేను నిన్ను చిత్రంబుగా ♦ నెత్తుచుంటి
చలనమందకే కెంగేలి ♦ చివర నిలిచి
హిమశిలల నాపికైలాస ♦ సమతగనుము.

(గోవర్ధనము నెత్తుచున్నాడు.)

నంద—మన కృష్ణునికేమైనఁ బిచ్చిపట్టెనదా! ఇదేమిపర్వతము నెత్తఁ బోవుచున్నాడేమి? ఆ! ఆ! ఆ! అట్లు నిజముగా నల్లలనాడి లేచునది పర్వతమేనా! ఆ! ఆ! నాకన్నులు సరిగాఁ జూచుచు న్నవా? నాకుఁగూడ మనోభ్రాంతి కలుగలేదు గదా!

(అందఱు నాశ్చర్యమునుఁ బొందుచున్నారు.)

బలరా—మనము చూచుచున్నదంతయు నిజమే! మనల రక్షింప భగవం తుఁడగు శ్రీకృష్ణుఁడిట్లు చేయుచున్నాఁడు. సందేహింపనేఁడు. మొదట నామహాత్మునికి నమస్కారి మొనర్పుఁడు.

(అందఱు జాగిలఁబడి మొక్కి లేచుచున్నారు.)

కృష్ణు—నాగోపకులారా! వెలుపల నింక నాలసించినచో మీపయిని రాళ్లు మఱియుఁబడును. తడయక లోపలికి రండు.

నందు—నాచేతులపై పెరిఁగిన చిన్నికృష్ణుఁడే యీపని చేయుట! ఒరీ! రామా! నీబుద్ధికూడ భ్రమఁ జెందలేదుగదా!

1 గొల్ల—ఆపెద్ద గట్టంతయు మాకృష్ణుని చిటికెనవ్రేలిపై నిలిచి యున్నదే!

గోపి—హా! మాపర్వతమెట్లు కదలక నిలిచియున్నదో!

నందు—మన చిన్నికృష్ణుఁడే!

కృష్ణు—మీరింకను వెలుపల నిలిచెదరేల? దీనిక్రిందకు రండు. బాలుఁడనై బలముచాలక దీనిని మీపై విడిచెదనేమోయని భయ మందుచున్నారేమో! ఆసందియము వలదు.

శా. "బాలుండీతఁడు కొండదాల్చి మహా ♦ భారంబు సైరింపఁగా
జాలండోయని దీనిక్రింద నిలువన్ ♦ శంకింపఁ గాఁబోలు నీ
శైలాంభోనిధి జంతుసంయుత ధరా ♦ చక్రంబుపైఁ బడ్డ నా
కేలల్లాడదు బంధులార! నిలుఁడీ ♦ క్రిందం బ్రమోదంబునన్"

(భాగవతము)

అన్నా! నీవేగి గోవుల నీక్రిందకుఁ దోలుకొనిరమ్ము. అందఱు నాకడకురండు. (అందఱుఁ బర్వతముక్రింద కేగుచున్నారు.)

గొల్లలు—ఆహా! ఇక్కడ యెంత హాయిగానున్నదో!

ముసలిగొల్లలు—వెచ్చగనున్నది.

1 గోపిక—ఇఁకనిక్కడ భయములేదు.

2 గోపిక—అమ్మయ్యో! హాయిగనున్నది. నిద్ర వచ్చుచున్నది.

1 వ గొల్ల—అపుడు ఈవానలో వెలుపలను పోలేము.

2 వ గోపకుడు—ఇక్కడనే నిద్రపోవుదము.

అందఱు—అవును. పరుందము.

(అందఱు శయనించి నిద్రింతురు.)

దేవేం—(తీవ్రతతో ప్రవేశించి.)

మంజరీద్విపద.

భూసభోంతరమెల్ల ♦ పూజ్యమౌననుచు
నేడుసముద్రంబు ♦ లేకమౌననుచు
ముష్కర గోపకుల్ ♦ మూడులోకములు
జలమయంబై సూర్య ♦ చంద్ర నక్షత్ర
వితతి పెన్నీటిలో ♦ వెతలందుననుచు
భీతిల్లి భ్రమజెంది ♦ బెదరి యీగొల్ల
లెల్లతల్లడమంద ♦ యీపర్వతములు
మారుమోగంగ; నీ ♦ మహికంపమొంద
విద్యుత్ప్రకాశము ♦ ల్వెలిగి యీజనుల
సంధులఁజేయుచు ♦ సంతటనిండు
సూర్యతేజమువోలె ♦ చూడంగలేని
జీవరాసులనెల్లఁ ♦ జీకాకుపఱుప;
"ఘెళు ఘెళ్లు" మనియొక్క ♦ పెట్టునభూమి
గోళంబుపగిలెనా ♦ ఘోరార్తినంది
యాభీరజనులెల్ల ♦ నడలియార్వంగ;
పిడుగులు పడునంత ♦ పెద్దయుఱుములును
వేర్పడ్లైవారికి ♦ వెఱపుగల్పింప;
నంతలోఁజీకటి ♦ యతిసాంద్రమగుచు

పరిసరారణ్య భూ ♦ ప్రాంతముల్ గ్రమ్మ;
గోవులార్చుచువచ్చి ♦ గోష్ఠముల్ దూర
మంచురాల్వానయు ♦ మబ్బులుమెరపు
లశని తేజంబులు ♦ నంధకారంబు
ముప్పిరిగొన్న యీ ♦ గొప్ప మేఘముల
బలముతోడుగ మహా ♦ బలుఁడైన వాయు
దేవుండ! నీవునీ ♦ ధీరతఁజూపి
ఘోరవాతాహతి ♦ కుధరంబు లదరి
చలియింప నిచ్చటి ♦ సకలభూజములు
గూఁకటివ్రేళ్ళతోఁ ♦ గూడి కూలంగ
శిలలు మెండాకుల ♦ వలెనె పై కెగయఁ
నీగిరిగుహాలన్ని ♦ యెసపి ఘోషిల్ల
యాభీరజనముల ♦ యాపల్లెయంత
ఘూర్ణిలోఁగలసి యు ♦ ద్ధూతమైపోవ
వీవఁగావలయును ♦ వెఱ్ఱిగొల్లలను
వారియావులను, వ్రే ♦ పల్లెయు, మేఁత
బయళులు, సర్వంబుఁ ♦ బ్రబలుఁడో దేవ
నాథునియాగ్రహా ♦ నలమునఁగూలు
దుష్టకీటకములై ♦ దురపిల్లవలయు
నెల్లలోకములేలు ♦ నింద్రునినన్ను
తేలికపఱచి మ ♦ త్తిలియున్న గొల్ల
బాలుఁడీవానలోఁ ♦ బడికుందవలయు
వజ్రిపంతముదీరి ♦ వరలంగవలయు

(అటు నిటుఁ జూచి) ఇప్పుడు నాకు సంతోషముగా నున్నది. మనసు కుదుటఁబడినది. గోస్తనముల గుంజుకొని బ్రతుకు నీయాభీరులఁట! నన్నుధిక్కరించి బ్రతుకుటయట! ఎక్కడఁజూచినను వారలలో నొక్కఁడయినఁ గనబడకుండ నాశనమై పోయిరి. మేలయ్యె. (గోవర్ధన పర్వతమును జూచి) ఆ! ఇదియేమి? ఈపర్వతము నిజముగాఁ గదలుచున్నదేమిఁ కోపావేశములో నేఁజెప్పినట్లుగ, గాలిదేవుండీ పర్వతములతోఁబాటుగఁ గులపర్వతములఁగూడఁ గదలించుచున్నాఁడేమి? గొల్లల శిక్షించుట తప్ప యది నాపనిగాదే! ఎలుకను బట్టుటకుఁ గొండత్రవ్వటయా! ఓహో! ఇదేమి? ఈపర్వతముక్రింద గుహలో నెవ్వరో నరులున్నారు. గొల్లలే! నన్నుఁ దప్పించుకొనుటకిక్రింద దాగియున్నవారు గొల్లలే! ఆ! ఎట్లు వారందఱును, వారిమందలన్నిఁటితోఁ గూడ నిండేయున్నారే! ఈపర్వతము క్రింద యంత పెద్ద గుహయున్నది. కాదు. గుహకాదు. గుహకాదు. నేను బర్వతముల కన్నిఁటికి శత్రువు నగుటచేత నాకెదురై, వారినిఁ బోషించుటకీ గట్టుపై కెగిరి, వారిపై రాళ్ళఁ బడనీక కాపాడుచున్నయది. అదియెట్లు? ఎగురుట కాకొండ కేమైన ఱెక్కలున్నవా? మైనాకమొక్కటితప్ప తక్కినవన్నియు నాచేఱెక్కలు గొట్టఁబడి యుండలేదా. చిత్రము. (బాగుగఁ జూచి) అరే! ఆశ్చర్యము! ఇంతపర్వతమును నిజముగా నాచిన్నబాలుఁడే యెత్తియున్నాఁడా? నాకనులు భ్రమచెందలేదుగదా? ఒక్కటికాదు. రెండుకాదు. వేయి కన్నులు; అన్నియు మోసపోయియుండవు. ఔను నిజమే! నన్నుధిక్కరించిన ఆబాలుఁడే యీకొండనెత్తి పట్టియున్నాఁడు. ఔరా! వీఁడొక మాయావియగు రాక్షసుఁడు. కాకున్న నీకొండ నెత్తిపట్టఁగలుగునా? కాని నేను వీనినింతటితో విడిచితినేని నేఁజేసిన యీప్రయత్నమంతయు నేమిప్రయోజనము? ముల్లోకములవారు నన్నప్పుడు "గొల్లల కోడిపోయిన యింద్రుఁడీతఁడే" యని గేలికొట్టరా! తప్పక వీనిపనిఁబట్టిగాని మఱల నేను స్వర్గమునకుఁబోవను. ఐన నింతపనిజేయుచున్న యీబాలుఁడెవ్వఁడో ముందెఱుంగవలయును. కావున వీనితో మాటాడి, బెదరించెదను. (దగ్గరజేరి)

శా. ఓరీ! బాలక నీవెవండవు?

కృష్ణు— ,, ,, ఇట నీ ♦ వాగోరి, యందెల్లర౯

జీర౯ వచ్చెదు నీవెవండవు?

ఇంద్రు— ,, ,, అమర ♦ శ్రీనేలి లోకాళి, నా

పేరే విన్నఁ గలంగు నింద్రుఁడను—

కృష్ణు— ,, ,, నేఁ ♦ బెంపైన గోవర్గము

వ్వారింగోరక మేపి యీయడవిలో ♦ వర్ధిల్లుగోపాలుఁడ౯.

దేవేం—ఎట్లు! "ఎవ్వరినిగోరకయే నీవీయడవిలో గోవులమేపుచున్నావుగా నాయాజ్ఞ లేకయే, చేయుచున్నావుగా! ఏమి నీగర్వము!

సీ. ఓరి? నీపేరేమి? ♦ ,, ,,

కృష్ణు— పేరులెన్నియొవేలు

గలవందులో నేది ♦ గావలయును?

దేవేం—(తనలో) ఆ! ఏమి వీనిపొగరు?

నీనివాసంబేడ ♦ ,, ,,

కృష్ణు— ,, నిఖిల జగంబులఁ

జెలఁగుదు నాకొక్క ♦ నెలవులేదు

దేవేం— జనకుఁడెవ్వఁడునీకు ♦ ,, ,,

కృష్ణు— ,, ,, జనులకే జనకుఁడ

గాని నాజనకుండు ♦ గలుఁగఁడెందు

దేవేం—ఏమి నీతలబిరుసుదనము?

,, ఏరుజెప్పిరినీకు ♦ నీగర్వవాక్యముల్?

కృష్ణు— ,, చెప్పెదనేనాకుఁ ♦ జెప్పరెవరు

దేవేం— ,, నెత్తికట్టితివేల ♦ యీకొండనీరీతి?

కృష్ణు— ,, గోవుల గొల్లలఁ ♦ గావఁగాను

దేవేం—— ,, అట్లొనర్చుటనాకు ♦ నహితముం జెలుఁగనే!

కృష్ణ—— ,, యెట్టిఁగియే చేసితి ♦ నేమిభయము

దేవేం—తే. గీ. దేవనాథుఁడు కోపింప ♦ దేవగణము
భయమునఁ జెడి నీకేల ♦ భయములేదు?

కృష్ణ— నాకునేనాథుఁడను ♦ వేఱునాథుఁడెవఁడు
నన్ను భయపెట్టఁగాలేడు ♦ నమ్మునిజము.

దేవేం—ఓరీ! పదరుబోతా! అమరేశ్వరుండ నగు నన్ను నల్పునిగా నెంచితివా?

కృష్ణ—కాని, గొల్లకుఱ్ఱనికంటె నెక్కువ వాఁడవు?

దేవేం—నేననిన నీకింతయైన లక్ష్యము లేకున్నదే! ఓరీ! యాగముమాను మని వీరినేల బోధించితివి?

కృష్ణ—ఏలబోధింపఁగూడదు?

దేవేం—(తనలో) ఓహో! ఈనీచుఁడు నేనేమడిగినను సరియైనయుత్తర మీఁకున్నాఁడే? వీనితో నిఁక సామవాక్యములు పనికిరావు. (ప్రకాశముగా) వాచాటా! నేనిప్పుడీ పర్వతము నీచేతినుండి యూడఁబెఱికి యావలవైచి యప్పుడు రాళ్ళ మఱింత నీపైని నీవారిపైని గురియించిన నేమిచేయఁగలవు?

కృష్ణ—ఏదీ! మొదట నీగట్టు నాచేతినుండియెత్తుము. చూతము.

దేవేం—ఆ! నన్నింక నధిక్షేపించు చుంటివిగా? ఇదే నీపొగరడంచెద. (గట్టునెత్తఁబోఁగా నది కదలకున్నది) ఏమి యీగట్టు! నాకును గదలుటలేదే! "గొల్లవానికున్నంత బలమైన నీకులేద" ని నన్నెవ్వరు నవ్వరా! ఈపూన్కి నింతటితో విడువను. ఓరీ! నీవు బాలకరూపధారివగు మహారాక్షసుఁడవు. కాని నాయాగ్రహానలమును గాఁగలేవుసుమా! పర్వతమునెత్తఁజాలకున్న నావజ్రాయుధముతో నిన్నును నీవెత్తినట్టి యీగట్టును వ్రక్కలగునటు

లేసిన నేమిసేసెదవు? (వజ్రాయుధముతో నటుకఁబోగా నంతయుఁ జీఁకటియగుచున్నది. రాళ్ళవాన గాలి నిలిచిపోవును).

(శ్రీకృష్ణాదులపై తెఱదిగును).

దేవేం—(తూలుచు వెనుకపడి) ఆ! నిజమా! కల్లయా! కలయా! మాయయా! మర్మమా! యంత్రమా! తంత్రమా! నిజముగా నాకు జ్ఞప్తికివచ్చు దుండగములన్నియు నేనేచేసితినా! శ్రీకృష్ణావతారతేజుఁడగు జగన్నాయకునకింత యెగ్గుదలఁచినది నామనసేనా? ఇతరులదా? లేక యిది యంతయు వట్టి భ్రమయా? కాదు. కాదు. నిజమే. మాయయ్యను దూషించినదీ గిర్వీష్టి పదనమేనా? మానాథునకెదుటఁ జాగిలిపడక మొండికొయ్యవలె నిలిచినదీ దుష్టతనువే? ఆతనిపై రాళ్ళుగురిపించిననీయింద్రుఁడే? మమ్ము నెన్నియోసార్లు కాచిన మహాత్మునిపై వజ్రము నెత్తిన యీకృతఘ్నుని హస్తములే? అవును. అవన్నియునీవే! ఆదుష్టుఁడు; ఆద్రోహి; ఆకృతఘ్నుఁడు; ఆపాపి; ఆనీచాతి నీచుఁడీ యింద్రుఁడే; బృహస్పతీ! నీమాటనైన నేలవినకుంటిని? విని యుండిన సర్వేశ్వరునకింత దగ్గఱగవచ్చియు, దూరమైయుండనే! పాదములఁబడి పూజలొనర్చ సమయమువచ్చినను, దుష్టరాక్షసునివలె నాతనిపైఁ జేయియెత్తియుండనే? ఏలవిందుసు? నాపాలు కోపము నాతల నావరించియుండ, గురుండవగు నిన్ను ధిక్కరించి పంపుదునుగాని సద్బోధనల విందునా? మేఘదేవతలారా! మీరు నేఁజెప్పినట్లేల చేసితిరి? మీకైనఁ దెలియలేదా? నేఁజెప్పినట్లు రాళ్ళఁ గురియకున్న, నేను మిమ్మేమి చేసి యుండఁగలను? మీకు నిజముగ నధికారి యూయయ్యయే కదా! ఔను? నాకర్మ మిట్లుండ మీరేల యన్యథా వర్తింతురు? వజ్రాయుధమా! నేనిన్ను నాస్వామిపై కెత్తినను, ఆతనికేహానియుఁ జేయకుంటచే, నీవు నాకు సన్మిత్రుండవుసుమా? నీ మేలెప్పుడును మఱువను. ఛీ! నినుంబోగను

చున్నాను. నీవు శ్రీకృష్ణపరమాత్మకు హానిచేయఁగలపాటివాఁ వా? ఎట్లు! నినుబోటి వేనకోటులైన నాతని కొనగోటికినంటఁ గలవా? అట్లు నిన్నెత్తినప్పుడు పాపినగు నన్నేల తెగనఱుకలేదు? ఓ! నీవు నాకు మిత్రుఁడవుకావు. శత్రుఁడవే. గోవర్ధన పర్వతమా! నీవె పుణ్యుఁడవు. పూజ్యుఁడవు. నాకుఁ బరమ మిత్రుఁడవు శ్రీపతి కెంగేలిపై నిలుచు భాగ్యమున్న కొండలకబ్బునా? ఆతనిని, అతనికిఁ బ్రియులగు గోపాలురను, గోపులను గాపాడు పుణ్యమన్ని రాళ్ళకుఁ బట్టునా! నేనన్నాతని చేతినుండి యూడఁ దెఱుకఁ బూనినప్పుడు నీవు నా చేతికి రాకుంటచే నాకుఁ బరమ మిత్రుఁడవు. అయ్యో! నాకు నాఁటినున్న బుద్ధియైన లేకుండె గదా! నేఁ గురిపించిన మంచుఱాళ్ళు నామహాత్మ్య మేమిచేయఁ జాలకున్నను, నాతఁడు గోపులను, గోపాలురను నెంతగా బాధించితినో! అందుచేత నాపై నాతని కెంతయాగ్రహము వచ్చెనదో! అక్కటా! ఈపాపమునకు నన్నాతఁడు క్షమించునా? ఈదుష్టుని దుండగములు మదిలో నెంచకుండునా? అయ్యో! నా పరమాత్మయే కోపించిన నాకింక నేదిదిక్కు? ఏది మార్గము! ఏది స్వర్గము! ఏది దేవేంద్రత్వము! మాయయ్య నను రక్షింపకున్న, నవన్నియుఁ గాల్పనా? ఇఁక నాకివ్నియు నెందులకు? హా! దేవ దేవా!

ఉ. కన్నుల మాయ గప్పికొనెఁ ♦ గర్వవశంబున నిన్ను, శ్రీశు, నా
పన్నశరణ్యు, దీనజన ♦ బాంధవుఁ గానక ద్రోహబుద్ధినే
నెన్నియొ మెగ్గులాడి, మఱి ♦ యింతయుఁ జేసితి నిట్టిపాపినై
మన్ననసేయు మంచెదఁగ ♦ మానస మొప్పదిఁ కేమి సేయుదున్?

చ. వెలఁగిన గర్వభారమునఁ ♦ జిత్తమునందున మేలు కీడులం
దెలియక చేసినాఁడ, నవి ♦ దేవుఁడ నెంకను నొప్పు నేరముల్
దలఁపకు వానిఁ గోపమున ♦ దండన కర్హుఁడనౌదు, కానినీ
వలుగక నన్ క్షమించి మహి ♦ తాంచిత సత్కృపఁ బ్రోవరాఁగదే.

ఉ. పలితముఁ బూని నీయెడలఁ ♦ బాపము నింతగఁ జేసినాఁడ, నా
వంతయు సిగ్గు లేక కడు ♦ వంచనఁ జేసియుఁ గావ్రమంచు నీ
చింతన యెట్లు చేసెదనొ ♦ చెప్పఁగఁజాల మహాత్మ ద్రోహినై
యొంతయు భీతిఁగొన్న సుతు ♦ నెవ్వఁడు గాచును తండ్రి వీడఁగా

శా. దేవా! శ్రీతము భూమినెల్ల జనులుం ♦ దేవేంద్రుఁడుం జెప్పు, సం
సేవల్ వ్రాలఁగ నాకె చేయఁగను నేఁ ♦ జిత్తంబులో నేటుగా
దైనం బే మతి లేదటంచుఁ దలఁచక ♦ దర్పించి, యజ్ఞానినై
భావంబందున నిష్ఠలంపని మహా ♦ పాపుండనైతిం గటా!

ఉ. నిన్నుఁ దలంపకుండ దన ♦ నేర్పును లావుఁ గణించి, గర్వియు
తోన్నతుఁడైన వాఁడెవఁడు ♦ నుద్ధతి సేవనిఁ జేయఁగాఁ గనెఁ
సన్నతిఁ గాంచనేరఁడఁట, ♦ సారసపత్ర విశాలనేత్ర! ని
న్నెన్ని యొనర్ప వేగ నుతి ♦ కెవ్వఁడు మూఁగ జగంబులందునన్.

నాదురదృష్ట మీతెఱఁగు ♦ నీ గరువంబున నన్ను మానిపిన్
నాదరమూర్తివై సుచ ♦ యంబును బ్రోవఁగ, రాజనాల నీ
వేఁడినఁ జేసినట్టి దయ ♦ పంపును జ్ఞాపకముంచుకొంచు, నా
బాధను జేసితే ఘనము ♦ వాఁడవి నాకు భక్తపాలనా.

తే. గీ. ఆని సోమకాసురుఁడు తా ♦ వేదములను
గొని, సముద్రంబులో డాఁగఁ ♦ జని నిశాలఁ
జంపి వాణీశునకుఁ దొలి ♦ చదువు లిచ్చి
నట్టి మీనరాజము నెంతు ♦ నధికభక్తి.

ఆ. వె. పాలసముద్రమునందుఁ ♦ బడి మున్గ మందర
గిరిని మోసి సురుమ్ముఁ ♦ బరువుపిచ్చి
యమృతమును జయంబు ♦ నమరుల కిచ్చిన
కూర్మనాథు భక్తిఁ గొలుతు ♦ నెపుడు.

సీ. లానితనీలరో ♦ లంబవేణీభార
మిరుల దిక్కులనిండఁ ♦ బలుగఁజేయఁ
గలికివాల్గన్నుల ♦ చలన విలాసంబు
ధీరుల మతులన్ని ♦ నీరుపఱుప
లలిత వాక్చాతురీ ♦ విలసనం బాకొన్న
జనుల వశ్యులఁజేసి ♦ కొని చెలంగ
మృదుల పాదద్వయు ♦ సదమల తేజంబు
పల్లవారుణకాంతి ♦ బారఁదోల
తే. గీ. మునిసొష్ఠనంబును గాంచి ♦ మానసముల
వేఱుతలఁపక యుల్లోక ♦ వితతి చూడ
సమ్మతి మమరులకును బంచి ♦ నట్టి, రుచిర
దివ్యతరమూర్తి మోహినీ ♦ దేవిఁ దలఁతు.

మత్తకోకిల.

ఘోరకోటి లమెల్ల మున్నతి ♦ దారుణ ప్రళయంబునన్
ఘోరసూ జలరాశిలోఁబడి ♦ క్రుంగ ధారుణినెత్తి యా
పారిరూ దనుజేంద్రునిన్ ♦ దనగొప్ప కోరలఁ బీల్చినన్
బోరి కరాళ్చినసూకరేశ్వరుఁ ♦ పూజ్యబుద్ధిఁ దలంచెదన్.

సీ. నేత్రద్వయమునుండి ♦ నెగడుకోపారుణ
కాంతికి రాకుసుల్ ♦ గను వణంక
వక్రదంష్ట్రాంచిత ♦ వదనగహ్వరఘన
గర్జనంబులకు జ ♦ గంబు గదల
శితనఖసంక్తి కో ♦ ణాత మీఱి, రాక్షస
శ్వారక్తధారల ♦ వరుసఁ గురియ
ఒంఘుప్రదేశంబు ♦ సంహృతాసుర నాగ
ఘనకళేబరగాడ ♦ ము ... 

తే. గీ. పాదపల్లవములచెల్వు ♦ బాలకునకు
సమితభక్తి ప్రభావంబు ♦ నంత దెలుప
బ్రహ్మరుద్రాదిసురలకు ♦ భయముదోఁప
నసురుఁదున్మించిన నరసింహు ♦ నాత్మనెంతు.

సుగంధివృత్తము.

జయము నంది మమ్ముల బలి ♦ చక్రవర్తి స్వర్గముం
భయములేక యేలుచుండ ♦ భంగపెట్టి యాతనిం
రయముగాను గ్రిందలోక ♦ రాజ్య మేలఁ బంపి, యే
దయను వామనుండు బ్రోచెఁ ♦ దలఁతు నట్టికూరిమిం.

ఉ. క్షత్రియుఁ డెవ్వఁడో పితరుఁ ♦ జంపె నటంచును గోప మూనినా
క్షత్రియు లందఱం దెలఁగి ♦ సంహరియించుచు, స్వర్గభూమికిం
క్షత్రియమూర్ధకోటి విరు ♦ సం బలుమెట్లను గట్టిపెట్టి, యా
క్షత్రియహంత నెంతు నతి ♦ సాహసు భార్గవ రామనామునిం.

మాలినివృత్తము.

భానుకులంబునఁ బుట్టి ధరాసుత ♦ భార్యగఁ గైకొని, తండ్రి నిజం
బాసయు నిల్పఁగఁ గాఱడవిం జని ♦ యంగనఁ గోల్పడి రాకసులం
వానరవీరుల సాయముతో ధర ♦ వ్రాలఁగఁ దున్మి, నిజాశ్రితులం
గాచి ముదంబునఁ దేల్చిన రాముని ♦ పూజిలి నామునినెంతుమదిం.

సీ. దేవకీవసుదేవ ♦ దివ్యపుణ్యఫలంబు
నందయశోదాభి ♦ నందనంబు
వరమునిమానస ♦ పంజరకీరంబు
వల్లవీజనక్షేత్ర ♦ వైభవంబుఁ
సకలరాక్షసమత్త ♦ గజసింహరాజంబు
దివిజహృత్సారసేం ♦ దిందిరంబు
సజ్ఞానకానన ♦ హరిణాగ్నితేజంబు
పుణ్యజనాళిప్ర ♦ పూజితంబు

తే. గీ. నయిన కృష్ణావతారము ♦ నందు నున్న
నిన్ను నెఱుఁగంగలేక యే ♦ మున్నవలను
జేయకుండఁగ నేరముల్ ♦ చేసినాఁడ
ఘోరనరకాంధకార సం ♦ చారినగుచు.

మహాత్మా! ఆపద్బాంధవా! శాంతగుణప్రధానా!

ఉ. క్రూరులఁ బాపి సజ్జనుల ♦ కెందగు మేలొనరించి కావఁగా
ధారుణి నెత్తితివ్వియవ ♦ తారము లింక మఱెన్ని యెత్తెదో
యేరెఱుఁగంగలారు భవ ♦ దీయ్ర తేజంబు నెఱుంగఁ జాలఁగా
నేరరు బ్రహ్మరుద్రు లిఁక ♦ నేనన నెంతటివాఁడ మాధవా!

చ. నిరతము ధ్యానయోగమున ♦ నిష్ఠమెయిం జరింయుచువారలే
యెఱుఁగరు నీమహామహిమ ♦ నెప్పుడు నాలుగు బిడ్డలుగ్ ధనం
బరయుచు నాకభోగముల ♦ నంది మదాంధతఁ గ్రుంకి ఘోరసం
సరణపు సాగరంబునను ♦ సాగెడినే నెఱుఁగంగ నేర్తునే.

కావున, నోయార్తజన దోషనివారకా! నామనవినాలింపుము

చ. ఎఱుఁగక చేయుతప్పిదమ ♦ దెంతటిదైనను, దీనపోషణా
చరణుఁడవార్తబంధుఁడవు ♦ సర్వజగత్పరిపోషకుండవుగ్
గరుణమెయిగ్ క్షమింపఁదగు ♦ గాని కసుగ్ గుపితుండవైన, నా
కరణిఁ జరించుమూఢులకుఁ ♦ గల్గునె జీవన మీజగంబునన్.

ఇట్లు లోకరక్షకుండవైన నీవే కోపించినయెడల నాకింక దిక్కెవఁడు? తండ్రియే కోపించిన బిడ్డ లెందుఁ దలదాచుకొనఁ గలుగుదురు?

ఉ. తండ్రివి మూఢమూర్ఖులకుఁ ♦ దండ్రివిలోక చయంబునంతకుగ్
దండ్రివి మాకు నెల్లరకుఁ ♦ దప్పుల నెన్నిటి మేముచేసినగ్
దీంద్రతఁ గోపమూని మముఁ ♦ దిట్టుట కొట్టుటమాని, సత్కృపగ్
దండ్రి! హితంబుతో సుతుల ♦ తప్పులు గావక కోపగింతువే?

తే. గీ. నీవు కోపమూని ♦ నిల్వ నేలోకవాటు
లేదు మాకు, నెచట ♦ నాదరణము
కలుగ దఖిలలోక ♦ కర్తవు నెచటను
జేర నేము లేదు ♦ వార మయ్య.

అయ్యయ్యో! ఇంకను మాయయ్యకు నాపై నలుక పోలేదా? కృష్ణా! మాధవా! భవత్కరుణాతేజః ప్రసారమున మదీయాజ్ఞానాంధకారము దొలఁగింపుము. లేకున్న నాకు వేఱు శరణంబు లేదు. నా యొనర్చిన దానికై నేనందుచున్న పశ్చాత్తాప మింతయని చెప్పుటకు నానోరు చాలకున్నది. ఐననేమి? నా మనస్సునఁగల దంతయుఁ దెలియఁజాలిన నీకు నేనోటితో వేఱుగఁ జెప్పవలెనా? అంతయు నీవెఱుఁగుదువు. నీవుఁ దెలియనిది లీలావిభూతియందును, నిత్యవిభూతియందు మఱి యొండును లేదు, కావున నీకుఁ బ్రియుండై నీయనంత మహాత్మ్యమెఱుంగఁ జాలినవాఁడే మహాత్ముఁడు. నీపాదపద్మము సోఁకిన భూమియే పుణ్యభూమి నీకైంకర్యమున కుపయుక్తములగు నేపదార్థములైనను పవిత్రములే: తదితరములు నన్నుఁబోలు జ్ఞానశూన్యులచే మెచ్చఁబడు దృణప్రాయములు.

సీ. నీకు వందన మిడ ♦ లేకున్న జగములఁ
గలఁగింపఁదగు బాహు ♦ బల మదేల?
నీచింత లేకున్న ♦ నిష్ఠాగరిష్ఠతఁ
దవిలి చేసెడి గొప్ప ♦ తపము లేల?
నీపాదజలజసా ♦ న్నిధ్యమునను వ్రాలి
శరణు వేఁడనిపది ♦ శిరము లేల?
నీమూర్తిదర్శించునిండు ♦ సంతోషంబుఁ
గాంచఁజాలని వేయు ♦ కన్ను లేల?

తే. గీ. నీకుఁ బ్రియమైన కార్యము • నెఱపనట్టి
ధనము నేల? రాజ్యంబేల? • ధైర్యమేల?
నీకు భక్తుండుగాని యే • లోకమునను
జననమందిన పూరుషు • జన్మమేల?

శ్రీహరీ! నీదయ లేకున్న నాకీస్వర్గరాజ్య మెందుకు? నాకీ వైభవము లెందుకు? ఇంద్రత్వమెందుకు? దేవేంద్రత్వ మెందుకుఁ గావలెనా? నారాయణా! వాసుదేవా! నీవు నన్నిప్పుడు కరుణింపకుండిన నేనిందే యుండి కల్పాంతముదాక నా ప్రాణములు పోవునంత భక్తవత్సలా నామసంకీర్తనము చేయుచుండెదను. అప్పటికైన నీకృప రాదా! అప్పటికైన నాపాపము లంతరింపవా? అప్పటికైన నాతపము ఫలింపదా?

సీ. మకరిచేఁ బట్టుఁబోఁ • మరణింపఁగానున్న
కరిరాజుఁ బ్రోచిన • కరుణ యేది?
దుర్వాసునస్త్రంబుఁ • దునిమి యాయంబరీ
షు ప్రాణములఁ గాచిన • సరణియేది?
దుష్టుడైన సుమాలిఁ • దోలి మమ్మెల్లర
వనియుంగఁ జేసిన • దయయు నేది?
యమకింకరులు పట్టి • పట్టియజామిళా
నాముఁ గాపాడిన • ప్రేమ యేది?

తే. గీ. యేది ప్రహ్లాదు, నారదు • నీక వాదు
నందనుని, శుకయోగిని • నాకుజముని
వరుస; నలవిభీషణునింక • భక్తజనుల
గోట్లకొలఁది రక్షించిన • కూర్మి పెంపు.

అకటా! గోపికానాథుని దయ నాపై నెప్పటికిని రాదేమో! అక్కటా దాకుండునా! అతఁడు దీనవత్సలుఁడే! (యోచించి) ఓహో! తెలిసినది. విశదమైనది. ఒరే! దేవేంద్రా! నీ వెంత గర్విష్ఠుఁడవు! శ్రీకృష్ణ

పరబ్రహ్మంబును బాధింపఁ జాలిన బలవంతుఁడవా! నీవొక రాళ్ళవాన యేగాదు. వేయిసారు లగ్నివృష్టి గురియఁ గల్గినను నా మహామహుని పాదరేణువునైనఁ గదల్పఁ గల్గుదువఁటరా! నీవు నొప్పించినది యీ నిష్కల్మషాంతఃకరణంబులగు గోపాలక గోయూథంబులను, అందుకొఱకే యీ దేవదేవుని కింత యాగ్రహము కలిగినది. లేకున్నఁ గలుగనే కలుగదు. అతఁడాశ్రిత వర్గములగు గోయూథములను, గోపాలురను నొప్పించుచుండిన నిన్నెప్పుడు క్షమించియే యుండును. కావున నీయొగ్గులకు లోనై యార్తినొందిన గోపాలురను గోవులను క్షమింపఁ వేడుకొనుము. అప్పుడు నిన్నే నీయయ్యకుఁ గరుణవచ్చును. ఔను నిజమే. అట్లు చేసెదను.

సీ. మునుల కందఁగరాని ♦ ఘనుని నెయ్యముగాఁగఁ
బడసిన గోపాల ♦ బాలురార!
బ్రహ్మకైనను లేని ♦ పరమోపసంసేవ
గలిగినగోపికా ♦ కాంతలార!
హరి కూర్మితో మిమ్ము ♦ నిరతంబుఁ గాపాడ
గుగుపుణ్యనిధులైన ♦ గోవులార!
వైకుంఠవాసుఁడు ♦ వరలునాయూరనే
మనుచున్న వ్రేపల్లె ♦ జనములార!

తే. గీ. వినుఁడి కోపినై నేమిమ్ము ♦ వెతలనందఁ
జేయ రాళ్ళనుగురిపించి ♦ శ్రీహరియెడ
గొప్పనేరము సలిపితిఁ ♦ గూర్మినన్ను
వే క్షమింపరె దండముల్ ♦ వేయునిడుదు.

(నమస్కరించును. తెఱయెత్తఁబడఁగా నంతయు వెలుగగును. గోవర్ధనగిరి గుహలో నిద్రించు గోపాలురు; గోపికలు; గోవులు; మురళి వాయించు కృష్ణుండు కనుపింతురు.)

దేవేం—ఎట్లు! నిజముగా నాభాగ్యము పండెనా! నా శ్రీకృష్ణుని, నా చిన్నికృష్ణుని, నా నల్లకృష్ణుని, గోపికానాథుఁడగు శ్యామకృష్ణుని సర్వలోకపూజ్యుండగు నాకృష్ణునిఁ గాంచు భాగ్యమబ్బెనా!

ఉ. శ్రీహరి! నీపదాబ్జములఁ ♦ జిత్తమునన్ దలపోసి కార్య సం
దోహములెల్ల నింపుమతి ♦ తోషము నీకరమంచు నెంచి యే
మోహమునందుఁ గ్రుంకకయె ♦ మూర్ధము నీకనయంబు వంచి, వే
ద్రోహులఁ బోకయున్న విభు ♦ లోన్నత సౌఖ్యపదంబు లందరే!

చ. ఎవ్వఁడు మలోకసంచయము ♦ నెప్పుడు కూరిమిఁ బ్రోచు; నబ్జజాం
డెవ్వనిపాదపద్మముల ♦ నిచ్చ మెయిన్ భజియించి ధీమతుల్
నివ్వటిలంగ సృష్టిగడు ♦ నేరుపుతోడుతఁ జేయఁజాలు, నే
నవ్విభుపాదపద్మముల ♦ సత్యనురాగముతో భజించెదన్.

ధన్యోస్మి! ధన్యోస్మి! (శ్రీకృష్ణుని పాదములపైఁ బడును).

కృష్ణు—దేవరాజా! వందనములు! వందనములు! ఈకట్టువానిపాదముల తాము మట్టఁదగునా? ఇది పెద్దలుఁ జూచిన నన్ను నిందఁ జేయుదురు. దయయుంచి లెండు. (లేవనెత్తి) ఇప్పుడు జరిగిన పనికై మీరు వగవకుఁడు. మనమిద్దఱము చాలకాలమునాఁటి నెయ్యులముగదా!

దేవేం—కృష్ణా! నీతో నెయ్యుఁడుగా నుండఁదగినంత వాఁడనా? నీ భృత్యుండను.

కృష్ణు—ఆ క్లిష్పటికి సెలవీయఁజనదు. తాము సర్వలోకపూజ్యులు. తమయుత్సాహము కొఱకీ చిత్రేతరనాటకము నాచే నాడించితిరి. అంతియేగాని వేరేమియున్నది?

దేవేం—(నవ్వి) దేవదేవా! ఏనాటకమెవ్వరిచే నాడించుటకును సర్వజగన్నాటకసూత్రధారివగు నీవ సమర్థుఁడవు. సర్వకర్మాంబుధుల నీవిలాసము కొఱకు నీకృష్ణావతార నాటకంబున లోక శాంతి

కరిమగు ఘోరరాక్షస సంహారాంకముయొక్క ప్రదర్శనమునకై దేవతలను ప్రేక్షకవర్గ మెదురుచూచుచున్నది.

కృష్ణు—మిత్రులగు దేవరాజు సంకల్పసిద్ధులు

దేవేం—స్వామీ! మిత్రుఁడవని నన్ను గారవించితివి గావున, నామిత్రత్వము చాటించుచు నీకొక మేలువార్త నెఱింగించెద వినుము.

తే. గీ. నీదు సహ తేజమా లక్ష్మి ♦ నీకు ప్రియము
సేయఁగాఁ, గుండినేశుని ♦ చిన్నితనయ
యై జనించె నీయవతారమందు ♦ వినుము!
రుక్మిణీనామ లాలిత ♦ రూపవిభవ
నామెఁ దగు సమయంబునఁ ♦ బ్రేమతోడ
భార్యగాఁ గొని సుఖములఁ ♦ బడయుమీవు.

కృష్ణు—దేవరాజు దీవనచే ధన్యుఁడను.

దేవేం—మఱియునో దేవా! నీచే రక్షింపఁబడు నీవ్రేపల్లె ప్రజకు నావరమనావశ్యకము. ఐనను ఎవరు గావించిన చెఱుపు వారిచే చక్కఁబెట్టించుట నీతిపథము గావున,

తే. గీ. వరమునిచ్చితి హిమశిలా ♦ వర్షమునను
ముందువలె వీరలెల్ల స ♦ మ్మోదమునను
సర్వసంపదలను పశు ♦ సంఘములను
గలిగి సుఖముల నెప్పుడుఁ ♦ గాంత్రుగాక!

కృష్ణు—కృతార్థులమైతిమి.

దేవేం—(మఱల కృష్ణునకు నమస్కరించి) స్వామీ! నేనాజ్ఞగొందును.

కృష్ణు—చింతామణీ వరంబున భద్రులరగుడు.

(దేవేంద్రుడు నిష్క్రమించును).

కృష్ణు—(ఒక్కింతసేపు మురళి వాయించి) తండ్రీ! తెల్లవారినది. లెండు. లెండు.

అందఱు—(మేల్కాంచి, ఒడళ్లు విఱుచుకొని, ఆవులింపుచు దిక్కులు చూచి-ఆశ్చర్యము నటింతురు).

నందు—ఓరీ! కృష్ణా! రాత్రి యెంత చిత్రమైన కల వచ్చినదిరా!

కృష్ణు—నాన్నా! ఏమది?

నందు—పెద్దరాళ్ళవాన నేడహోరాత్రములు కురిసినదట. మనలను గోవులను ముప్పతిప్పలు పెట్టినదట. పల్లె కల్లోలమైనదట.

అందఱు—నాకు నట్టికలయే వచ్చినది. నాకట్టిదే వచ్చినది.

కృష్ణు—(నవ్వుచు) నాన్నా! నిన్నటిరేయి మీరందఱు పక్వాన్నము లెక్కువగా మెక్కుటచే పీడకల వచ్చినది. అదిగో చూడండి. పల్లె యిప్పటియట్లు కలకలలాడుచున్నది.

గోపి—నీవీకొండను యెత్తి మాపై రాళ్ళవాన కురియకుండగ పట్టినట్లు కల నాకువచ్చినది మాధవా!

అందఱు—ఔనౌను! నాకునట్లే. నాకునట్లే?

కృష్ణు—మేలు. మంచికల. నేనీపెద్దకొండనెత్తుటే' కలలోనైన నీకది వెఱ్ఱిగాదో ఏలేదా!

నందు—ఎట్లయిననేమి' అందఱము క్షేమముగానున్నాము. లెండు. లెండు. లేఁగలను, తల్లియావులవద్దకు తోలి పాలుదీయుఁడు, ఓరీ! వాలకుంతల తోముఁడు. నమువృషు పల్లెకు. పండుగ వంటలుఁదిని, చాలసేపీగట్టుకొద్ద కూర్చొనాము.

బలరా—ఔను! తండ్రీ' ఎట్టి యద్భుతానుభవములును తత్కాలమున నిజములు. ఆపిదప అనుదినకార్యములకు మఱలునప్పుడా యనుభవములే స్వప్నతుల్యము లగును. ఇది లోకమర్యాద. కావున నిట్లగుఁగాక!

## గోవర్ధనోద్ధారణము.

### భరతవాక్యము.

ఉ. ధారుణిగర్వభారమున • ధర్మ మధర్మ మొఱంగ కుంఠితంగా
నేరుసుధీసులల్ వెతల • నింతయుఁ గూర్పక, గోగణంబులన్
గూరిమిఁ బ్రోచి మేఁతలిడి • గోప్యగఁ గాంచుచు సర్వపావనన్
చేరఁగ కృష్ణకల్పమున • చిత్తములందున నెంత్రముగాభృతుల్

అందఱు—తథాస్తు.

(నిష్క్రమింతురు).

తే. గీ. అఖిలలోకేశుఁ డవ్యయుఁ • డాదిపురుషుఁ
డ్రీశుఁ, గోవిందుఁ, డచ్యుతుఁ, • డింతఁ జేసి
వ్రాయఁగల్గితినాటక • రాజమును
వాత్సల్య సన్నియును జేయు • వలనువడగ

ప్రీశ్రీభవానీశ్వరో విజయతేతాం.

శ్రీరామార్పణమస్తు.



## శ్రీశోభనాద్రి లక్ష్మీనృసింహస్వామినేనమః

### తప్పొప్పుల పట్టిక.

| పేజీ. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 2 | 16 | బాష | భాష |
| 3 | 6 | రెలవి | రెలమి |
| 2 | 23 | గంము | గరము |
| 5 | 7 | హైనసు. | హైనసు |
| 7 | 1 | ప్రస | ప్రభ |
| 7 | 13 | కొస | శోప |
| 8 | 8 | నాగ | స్వాగం |
| 12 | 25 | దార్ధి | ద్వార్థ |
| 13 | 12 | మూట | తోంట |
| 15 | 13 | శత్ర | శత్రు |
| 22 | 15 | నాధు | నాథు |
| 23 | 8 | నాధా | నాథా |
| 23 | 15 | గుమ్మరి | గ్రుమ్మరి |
| 27 | 2 | వ్రస | ప్రం |
| 28 | 18 | వానికి | వానికి బుద్ధిచెప్పుదురు. కాని యిదేమిః ఊరం డలు నొక |
| 28 | 19 | వస్త్రా | వస్త్రం |
| 28 | 20 | వారం | వారం |
| 40 | 14 | చేయుం | చేయు |
| 43 | 5 | ప్రవే | ప్రవే |
| 46 | 6 | విన్న | విన్న |

| పే. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 48 | 19 | మసు | దాను |
| 50 | 2 | యంత | పంప |
| 50 | 13 | [illegible] | [illegible] |
| 52 | 13 | [illegible] | [illegible] |
| 54 | 7 | భ | భవ |
| 54 | 13 | [illegible] | [illegible] |
| 54 | 15 | [illegible] | [illegible] |
| 56 | 7 | [illegible] | [illegible] |
| 58 | 5 | [illegible] | [illegible] |
| 58 | 13 | [illegible] | [illegible] |
| 59 | 7 | [illegible] | [illegible] |
| 59 | 8 | [illegible] | [illegible] |
| 59 | 10 | [illegible] | [illegible] |
| 59 | 11 | [illegible] | [illegible] |
| 59 | 22 | [illegible] | [illegible] |
| 59 | 24 | [illegible] | [illegible] |